www.peoplesnews.in

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 190 శుక్రవారం, నవంబర్ 27, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400



దేశ సంపదను కొల్లగొట్టేందుకు కుట్రలు

● రాజ్యాంగంపై మోడీ ముఠా దాడి ● ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్యం గిట్టని సంఘ్ పరివార్.. రాచరికాన్ని మళ్లీ తీసుకొచ్చేందుకు బీజేపీ ప్రయత్నాలు ● ఆ కుయుక్తులను తిప్పికొడదాం.. రాజ్యాంగాన్ని కాపాడుకుందాం: సీఎం రేవంత్‌రెడ్డి



పార్లమెంట్ ప్రత్యేక భేటీకి ముహూర్తం ఖరారు

నవంబర్ 30 నుంచి ప్రత్యేక సమావేశాలు.. కీలక అంశాలపై చర్చకు అవకాశం

న్యూఢిల్లీ,నవంబర్ 26 : పార్లమెంట్ ప్రత్యేక అంశాలపై చర్చించే అవకాశం ఉంది. సమావేశాల నిర్వహణకు సంబంధించిన పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ షెడ్యూల్ ఖరారైంది. ఈ సమావేశాల్లో కీలక రిజిజు మిగతా2లో...

తెలంగాణ పారిశ్రామిక రంగంలో మరో భారీ పెట్టుబడి

వర్గల్‌లో రూ.1,500 కోట్లతో వింటేజ్ కాఫీ ప్లాంట్..

దక్షిణాసియాలోనే తొలిసారిగా అత్యాధునిక సాంకేతికత వినియోగం



శ్రీవారి సేవలో సీఎం చంద్రబాబు

● రూ.206 కోట్ల విలువైన 121 కిలోల బంగారు, వజ్రాభరణాల సమర్పణ
● కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి దంపతులు



తిరుమల,నవంబర్ 26 : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం తిరుమల పర్యటనలో బిజీబిజీగా గడిపారు. చెన్నైకి చెందిన పారిశ్రామికవేత్త వర్ధమాన్ జైన్ కుటుంబం శ్రీవేంకటేశ్వరస్వామికి రూ.206 కోట్ల విలువైన 121 కిలోల బంగారు, వజ్రాభరణాలను సమర్పించింది. ఈ కార్యక్రమంలో చంద్రబాబు దంపతులు స్వయంగా పాల్గొన్నారు. ఆభరణాల సమర్పణ నేపథ్యంలో టీటీడీ అధికారులు, జిల్లా యంత్రాంగం పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఉదయం 6 గంటలకే ప్రత్యేక వాహనంలో ఆభరణాలను తిరుమలకు తీసుకొచ్చారు. అనంతరం వర్ధమాన్ జైన్ కుటుంబ సభ్యులు ఆలయానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి సంప్రదాయ మిగతా2లో...

రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది?

- యువ వికాసం ఓ ఎండమావి.. కాంగ్రెస్‌పై కేటీఆర్ విమర్శలు



హైదరాబాద్,నవంబర్ 26 : తెలంగాణ యువతకు రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న కాంగ్రెస్ హామీ మిథ్యగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. యువ వికాసం పథకం కూడా నిరుద్యోగులకు ఆశ చూపి ఆచరణలో కనిపించని ఎండమావిగా మిగిలిందని ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి గురువారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన విమర్శలు చేశారు. మూడేండ్ల క్రితం హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో రాహుల్‌గాంధీ పర్యటించి, ఇరానీ చాయ్ తాగుతూ నిరుద్యోగ యువతకు అనేక హామీలు ఇచ్చారని కేటీఆర్ గుర్తుచేశారు. ఏడాదిలో రెండు లక్షల మిగతా2లో...



సాగర్ జలాలపై మళ్లీ వివాదం

అనుమతులు లేకుండానే కుడి కాలువకు ఏపీ నీటి విడుదల.. ఎడమ కాలువ గేట్లు తెరిచిన తెలంగాణ అధికారులు

నాగార్జునసాగర్,26: నాగార్జునసాగర్ జలాల విడుదలపై ఆంధ్రప్రదేశ్, మిగతా2లో...

అచ్చంపేట రూపురేఖలు మారుస్తాం

● రాష్ట్రానికే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా: సీఎం రేవంత్‌రెడ్డి
● పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేసి కృష్ణా జలాలతో జిల్లాను సస్యశ్యామలం చేస్తా: సీఎం రేవంత్‌రెడ్డి ● త్వరలో మరో 25 వేల ఉద్యోగాల భర్తీ



మహబూబ్‌నగర్,నవంబర్ 26 : నల్లమల బిడ్డగా పాలమూరు ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసి, అచ్చంపేట నియోజకవర్గాన్ని రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ ప్రాంతాన్ని కృష్ణా జలాలతో తడపాల్సిన బాధ్యత తనపై ఉందని స్పష్టం చేశారు. అభివృద్ధి కోసం గత 34 నెలల్లో ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదని తెలిపారు. అచ్చంపేట ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించి అభివృద్ధి చేస్తానని మిగతా2లో...



బండి భగీరథ్‌కు పోక్సో కోర్టు సమన్లు

జనవరి 28న వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశం.. కేసు విచారణలో కీలక పరిణామం

ప్రజాస్వామ్యానికి అసమ్మతే బలం

విమర్శలను స్వీకరించే సామర్థ్యం సంస్థలకు ఉండాలి.. రాజ్యాంగ విలువలను గౌరవించాలి: సీజేఐ సూర్యకాంత్



దేశ సంపదను కొల్లగొట్టేందుకు కుట్రలు

హైదరాబాద్,నవంబర్ 26 : దేశ సంపదను కొల్లగొట్టేందుకు ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, పారిశ్రామిక వేత్తలు అదానీ, అంబానీ కలిసి కుట్రలు పన్నుతున్నా రని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. దేశ సంపదను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు అడ్డుగా ఉన్న రాజ్యాంగాన్ని తొలగించాలనే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు సమాన హక్కులు, స్వేచ్ఛ, అధికారాన్ని కల్పించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని పిలుపునిచ్చారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థల పరిరక్షణ కోసం కాంగ్రెస్ దేశవ్యాప్తంగా పోరాటం కొనసాగిస్తోందని స్పష్టం చేశారు.రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఏఐసీసీ పిలుపు మేరకు గురువారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం నుంచి నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన 'సంవిధాన్ రక్షా మార్చ్' పేరుతో భారీ ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి బి.ఎం.సందీప్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ ప్రతులను చేతబట్టి భారీ ర్యాలీగా ఇందిరాగాంధీ విగ్రహం వరకు సాగారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగం వల్లే దేశంలో రాచరిక వ్యవస్థ రద్దయి ప్రజాస్వామ్యం ఏర్పడిందని, ప్రజలు తమ పాలకులను తామే ఎన్నుకునే హక్కు పొందారని గుర్తుచేశారు. ప్రజలకు సమాన ఓటు హక్కు, భావప్రకటన స్వేచ్ఛ, తమ హక్కుల కోసం పోరాడే అవకాశం రాజ్యాంగం కల్పించిందన్నారు. అయితే సంఘ్ పరివార్, బీజేపీ మొదటి నుంచీ ప్రజలకు సమాన హక్కులు, అధికారం దక్కడం పట్ల వ్యతిరేక వైఖరి ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. దేశంలో ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్యం, రాజ్యాంగ వ్యవస్థలను బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.స్వతంత్ర సంస్థలైన ఈడీ, ఎన్నికల సంఘం వంటి వ్యవస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్నారని సీఎం విమర్శించారు. ఓటర్ల జాబితా నుంచి కోట్లాది ఓట్లను తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నా యని ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కును కాపాడుకోవాలని, ఎన్నికల వ్యవస్థ స్వతంత్రతను పరిరక్షించాలని అన్నారు. గతంలో బ్రిటిష్ పాలకులపై పోరాడి స్వాతంత్ర్యం సాధించిన కాంగ్రెస్ పార్టీ, నేడు రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజలతో కలిసి పోరాడుతుందని పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణ పోరాటంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని రేవంత్‌రెడ్డి కోరారు.

శ్రీవారి సేవలో సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

వస్త్రధారణలో ఆలయానికి చేరుకుని రంగనాయకుల మండపంలో ప్రదర్శనకు ఉంచిన ఆభరణాలను పరిశీలించారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం దాతలతో కలిసి ఆభరణాలను ఊరేగింపుగా గర్భాలయానికి తీసుకెళ్లే కార్యక్రమంలో పాల్గొన్నారు. తిరుమలలో భక్తులను పలకరించిన ముఖ్యమంత్రి, అనంతరం వర్ధమాన్ జైన్‌తో కలిసి పద్మావతి అతిథిగృహంలో మీడియాతో మాట్లాడారు. ఆభరణాల సమర్పణ విశిష్టతతో పాటు తిరుమల అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు.**తిరుమలకు నీటి కొరత రాకుండా చర్యలు** తిరుమలలో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని చంద్రబాబు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఈసారి నీటి కొరత ఏర్పడే పరిస్థితులున్నాయని పేర్కొన్నారు. అయినప్పటికీ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని భరోసా ఇచ్చారు. హంద్రీనీవా నుంచి కల్యాణి డ్యామ్‌కు నీటిని తరలించడంతో పాటు, సోమశిల జలాలను బాలాజీ రిజర్వాయర్ ద్వారా తిరుమలకు తీసుకొచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. **'వృక్షగోవిందం'తో పచ్చదనం పెంపు** తిరుమల కొండల్లో పచ్చదనాన్ని మరింత పెంచేందుకు 'వృక్షగోవిందం' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని ముఖ్యమంత్రి ప్రకటించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ తిరుమల సహజ సౌందర్యాన్ని కాపాడుతామని తెలిపారు. శ్రీవారి క్షేత్రంలో ఆధ్యాత్మికతతో పాటు పర్యావరణ పరిరక్షణ, నీటి భద్రతకు కూడా ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి తిరుమల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు.

అచ్చంపేట రూపురేఖలు మారుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

హామీ ఇచ్చారు.గురువారం అచ్చంపేటలో నిర్వహించిన 'ప్రజాపాలనప్రగతి బాట' కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. కోటి మంది మహిళలకు ఆకుపచ్చ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కొత్తగా మంజూరైన 6.12 లక్షల చేయూత పింఛన్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. అంబేద్కర్ అందించిన రాజ్యాంగ స్ఫూర్తితోనే దేశంలో విద్య, సాగునీటి రంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇచ్చాయని పేర్కొన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టుల నిర్మాణంతో లక్షలాది ఎకరాలు సాగులోకి వచ్చాయని తెలిపారు. తమ ప్రభుత్వం మూడేళ్ల పాలనలో 25.35 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసిందని, రైతుల కోసం మొత్తం రూ.1.78 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు.**పాలమూరు ప్రాజెక్టులపై విమర్శలు** పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు నిర్లక్ష్యం చేసిందని సీఎం విమర్శించారు. ప్రాజెక్టులు పూర్తికాకపోవడంతో కృష్ణా జలాలు ఆంధ్రప్రదేశ్‌కు తరలిపోతున్నాయని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ నాయకులు ఢిల్లీలో ఒప్పందాలు చేసుకుని తెలంగాణకు అన్యాయం చేశారని విమర్శించారు. పాలమూరు బిడ్డగా జిల్లాలోని ప్రాజెక్టులను పూర్తి చేసి సాగునీరు అందించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు.**త్వరలో 25 వేల ఉద్యోగాలు** తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే 75 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని రేవంత్‌రెడ్డి తెలిపారు. త్వరలో మరో 25 వేల ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. 2034 వరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని, అప్పటి వరకు తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, వేం నరేందర్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

సైబరాబాద్ సీపీ, డీసీపీకి
రెండు వారాల జైలు

- కోర్టు ధిక్కరణ కేసులో హైకోర్టు కీలక తీర్పు..



ఒక్కొక్కరికి రూ.2 వేల జరిమానా

హైదరాబాద్,నవంబర్ 26 : కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు పోలీసు ఉన్నతాధికారులకు తెలంగాణ హైకోర్టు రెండు వారాల సాధారణ జైలు శిక్ష విధించింది. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం.రమేష్‌రెడ్డి, మేడ్చల్ డీసీపీ ఎన్.కోటిరెడ్డికి ఈ శిక్ష విధిస్తూ గురువారం తీర్పు వెలువరించింది. ఒక్కొక్కరికి రూ.2 వేల జరిమానా కూడా విధించింది.మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా జీడిమెట్లలోని 6.15 ఎకరాల భూమికి సంబంధించిన వివాదంలో ఈ కేసు నమోదైంది. భూమిపై పిటిషనర్ స్వాధీనానికి రక్షణ కల్పించాలని గతంలో హైకోర్టు పోలీసులను ఆదేశించింది. అయితే ఆ ఉత్తర్వులను అమలు చేయలేదంటూ బాధితుడు కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం పోలీసు అధికారుల వివరణను పరిగణనలోకి తీసుకోకుండా కోర్టు ధిక్కరణ కింద శిక్ష విధించింది.జరిమానా చెల్లించకపోతే అదనంగా మరో వారం జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అయితే తీర్పుపై హైకోర్టులో అప్పీలు చేసుకునేందుకు వీలుగా శిక్ష

బండి భగీరథ్‌కు పోక్సో కోర్టు సమన్లు

జనవరి 28న వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశం.. కేసు విచారణలో కీలక పరిణామం

హైదరాబాద్,నవంబర్ 26:కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌కు మేడ్చల్ ప్రత్యేక పోక్సో న్యాయస్థానం సమన్లు జారీ చేసింది. ఈ కేసు విచారణలో భాగంగా వచ్చే ఏడాది జనవరి 28న వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. 17 ఏళ్ల బాలికపై వేధింపులకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలతో నమోదైన కేసులో ఈ పరిణామం చోటుచేసుకుంది.బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ ఏడాది మే 8న పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. తన కుమార్తెను వేధించడంతో పాటు మద్యం తాగించి శారీరకంగా ఇబ్బందులకు గురిచేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు పోక్సో చట్టంలోని పలు సెక్షన్లతో పాటు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) నిబంధనలను కూడా చేర్చారు. ఆధారాల ధ్వంసానికి సంబంధించిన అభియోగాలపైనా దర్యాప్తు చేపట్టారు.ఈ క్రమంలో మే 16న భగీరథ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్ విధించారు. అనంతరం దర్యాప్తు కొనసాగిన నేపథ్యంలో తెలంగాణ హైకోర్టు జులైలో షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. బాధితురాలిని, సాక్షులను సంప్రదించరాదని, కేసు గురించి మీడియా, సామాజిక మాధ్యమాల్లో వ్యాఖ్యలు చేయరాదని న్యాయస్థానం షరతులు విధించింది.తాజాగా మేడ్చల్ పోక్సో కోర్టు జనవరి 28న హాజరుకావాలని సమన్లు జారీ చేయడంతో కేసు మరోసారి చర్చనీయాంశమైంది. ఈ కేసులో నమోదైన ఆరోపణలు ఇంకా న్యాయస్థానంలో నిరూపితం కావాల్సి ఉంది.

పార్లమెంట్ ప్రత్యేక భేటీకి ముహూర్తం ఖరారు

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించిన వివరాల ప్రకారం నవంబర్ 30న లోక్‌సభ, డిసెంబర్ 2న రాజ్యసభ సమావేశాలు జరగనున్నాయి. డిసెంబర్ 3 వరకు సమావేశాలు కొనసాగనున్నట్లు సమాచారం.ఈ ప్రత్యేక సమావేశాల్లో ఏయే అంశాలను చర్చకు తీసుకురానున్నారనే దానిపై ఆసక్తి నెలకొంది. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన వంటి అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపిస్తున్నప్పటికీ, సమావేశాల ఎజెండాపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

సాగర్ జలాలపై మళ్లీ వివాదం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రాష్ట్రాల మధ్య మరోసారి వివాదం తలెత్తింది. గురువారం ఉదయం ఆంధ్రప్రదేశ్ అధికారులు కృష్ణా నది యాజమాన్య బోర్డు అనుమతులు లేకుండానే కుడి కాలువకు నీటిని విడుదల చేసినట్లు తెలంగాణ అధికారులు పేర్కొన్నారు. దీంతో అప్రమత్తమైన తెలంగాణ అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎడమ కాలువ గేట్లను తెరిచి నీటి విడుదల ప్రారంభించారు.ఎడమ కాలువ పరిధిలోని పెద్దదేవులపల్లి, పాలేరు రిజర్వాయర్లను తాగునీటి అవసరాల కోసం నింపేందుకు నీటిని విడుదల చేస్తున్నట్లు తెలంగాణ సాగర్ డ్యాం ఎస్ఈ మల్లికార్జునరావు తెలిపారు. మరోవైపు కుడి కాలువ పరిధిలో తాగునీటి అవసరాల కోసం సుమారు 8 టీఎంసీల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏపీ అధికారులు వెల్లడించారు.**తగ్గుతున్న నీటి నిల్వలు** సాగర్ జలాశయంలో ప్రస్తుతం 176 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు సమాచారం. కనీస నీటిమట్టం 510 అడుగులకు చేరితే వినియోగానికి సుమారు 45 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఇప్పటికే నీటి పంపిణీపై చర్చించేందుకు నవంబర్ 23న కృష్ణా నది యాజమాన్య బోర్డు ఏర్పాటు చేసిన త్రిసభ్య సమావేశం వాయిదా పడింది. ఈలోగా రెండు రాష్ట్రాలు నీటిని విడుదల చేయడం వివాదానికి కారణమైంది.గురువారం సాయంత్రానికి సాగర్ నీటిమట్టం 533.90 అడుగులుగా ఉంది. జలాశయంలోకి 5,663 క్యూసెక్కుల నీరు వస్తుండగా, కుడి కాలువకు 6,324, ఎడమ కాలువకు 3,549, ఎస్ఎల్‌బీసీకి 2,000 క్యూసెక్కుల చొప్పున మొత్తం 11,873 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రెండు రాష్ట్రాల మధ్య సమన్వయం లేకుండా నీటి విడుదల కొనసాగితే జలాశయంలో నిల్వలు తగ్గే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

ప్రజాస్వామ్యానికి అసమ్మతే బలం

న్యూఢిల్లీ,నవంబర్ 26 :
రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో అసమ్మతి బలహీనత కాదని, అది ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన భాగమని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ గురువారం నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. బలమైన బార్ అసోసియేషన్ ప్రశ్నించగలగాలని, తప్పులను సవాలు చేయాలని, భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేయాలని పేర్కొన్నారు. విమర్శలను అధికారానికి ముప్పుగా భావించకుండా స్వీకరించే పరిణతి సంస్థలకు ఉండాలని సూచించారు.అయితే అసమ్మతి హేతుబద్ధత, వృత్తిపరమైన నిబద్ధత, రాజ్యాంగ ప్రక్రియల పట్ల గౌరవంతో ఉండాలని తెలిపారు. రాజకీయ అజెండాలను వృత్తిపరమైన బాధ్యతలుగా చూపడం, వ్యక్తిగత ప్రయోజనాల కోసం న్యాయ వేదికలను ఉపయోగించుకోవడం వల్ల వృత్తిపరమైన సమగ్రత దెబ్బతింటుందని హెచ్చరించారు.పెండింగ్ కేసులు, విచారణలో జాప్యం, న్యాయసేవలు పొందడంలో అసమానతలు ప్రజలకు న్యాయవ్యవస్థపై ఉన్న అనుభవాన్ని ప్రభావితం చేస్తున్నాయని అంగీకరించారు. ప్రతి కేసు వెనుక ఒక వ్యక్తి హక్కు కోసం లేదా న్యాయం కోసం ఎదురుచూస్తుంటారని గుర్తుచేశారు. న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం స్వాతంత్ర్యం, నిష్పక్షపాతం, నిబద్ధతతోనే నిలుస్తుందని సీజేఐ పేర్కొన్నారు.

రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది?

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగాలు భర్తీ చేస్తామని, యువత భవిష్యత్తుకు భరోసా కల్పిస్తామని ప్రకటించినా, ఆ హామీలు నేటికీ నెరవేరలేదని విమర్శించారు. ఉద్యోగాల భర్తీ అంటే ఫొటోషూట్లు, ప్రచార కార్యక్రమాలు కాదని, దానికి స్పష్టమైన ప్రణాళిక, దృఢ సంకల్పం అవసరమని పేర్కొన్నారు. కనీసం ఒక్క ఉద్యోగం కల్పించడంలోనూ కాంగ్రెస్ నాయకత్వం విఫలమైందని ఆరోపించారు.ప్రత్యేక తెలంగాణ కోసం గతంలో పోరాడిన యువత తమ హక్కుల కోసం మరోసారి ఉద్యమించేందుకు సిద్ధంగా ఉందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలన నుంచి తెలంగాణను విముక్తి చేసేందుకు యువత పోరాటం చేస్తుందని అన్నారు. ఇది కేసీఆర్ గడ్డ, పోరాట యోధుల గడ్డ అని పేర్కొంటూ, యువత తమకు జరిగిన అన్యాయాన్ని మరిచిపోదని వ్యాఖ్యానించారు.**పంచాయతీలకు నిధుల కొరత** కాంగ్రెస్ పాలనలో తెలంగాణ గ్రామ పంచాయతీలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని కేటీఆర్ ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో మిగులు బడ్జెట్‌తో ఉన్న పంచాయతీలు 202425 నాటికి ఆర్థిక లోటులోకి వెళ్లాయని పేర్కొన్నారు. 202223లో గ్రామ పంచాయతీల సగటు వ్యయం రూ.16.59 లక్షలు ఉండగా, 202425 నాటికి రూ.6.24 లక్షలకు పడిపోయిందని తెలిపారు. నిధుల కొరతతో గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో పాటు పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ కూడా సక్రమంగా సాగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య సాధనకు కేసీఆర్ పాలనలో కృషి జరిగిందని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు.

తెలంగాణ పారిశ్రామిక రంగంలో మరో భారీ పెట్టుబడి

హైదరాబాద్,నవంబర్ 26 :ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు కేంద్రంగా ఎదుగుతున్న తెలంగాణలో మరో భారీ పరిశ్రమ ఏర్పాటుకు అడుగు పడింది. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం అవుసులోనిపల్లిలో రూ.1,500 కోట్ల పెట్టుబడితో వింటేజ్ కాఫీ అండ్ బెవరేజెస్ లిమిటెడ్ సంస్థ రెండు దశల్లో ఫ్రీజ్ డ్రైడ్ ఇన్‌స్టంట్ కాఫీ తయారీ పరిశ్రమను నిర్మించనుంది. తొలి దశలో 5,500 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేయనున్న యూనిట్‌కు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గురువారం భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ పరిశ్రమలో దక్షిణాసియాలోనే తొలిసారిగా అత్యాధునిక రోటో సాంకేతికతను వినియోగించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. ఫ్రీజ్ డ్రైడ్ కాఫీ తయారీలో ఉపయోగించే ఆధునిక సాంకేతికతపై స్థానిక యువత, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. 2027 చివరి నాటికి ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏడాదికి 11 వేల మెట్రిక్ టన్నులకు పెంచనున్నట్లు మంత్రి వివరించారు. ఇక్కడ తయారయ్యే కాఫీ ఉత్పత్తులను యూరప్, ఆగ్నేయాసియా, ఆస్ట్రేలియా, అమెరికా, రష్యా సహా 22 దేశాలకు ఎగుమతి చేయనున్నట్లు తెలిపారు. తద్వారా 'మేడ్ ఇన్ తెలంగాణ' ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్‌లో గుర్తింపు లభించనుంది.రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తోందని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. పరిశ్రమల స్థాపనకు తెలంగాణ అనుకూలమైన రాష్ట్రంగా ఉందని, పారిశ్రామికవేత్తలు పెట్టుబడులతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, వింటేజ్ కాఫీ సంస్థ సీఎండీ తాటి బాలకృష్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గౌడ కులస్తుల కార్తీక వనభోజనాలు

■ కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల కలయికతో సందడిగా వేడుకలు



భూపాలపల్లి జిల్లా ప్రతినిధి నవంబర్ 26(పీపుల్స్ న్యూస్) :
భూపాలపల్లి పట్టణంలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్తీక వనభోజన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య సాగింది. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమంలో గౌడ కులస్తులు కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆధ్యాత్మిక వాతావరణంలో పూజా కార్యక్రమాలు చేపట్టి, కార్తీక మాస ప్రాముఖ్యతను స్మరించుకున్నారు. అనంతరం ప్రకృతి ఒడిలో వనభోజనాలు ఏర్పాటు చేసుకొని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆనందంగా గడిపారు. చిన్నారులు ఆటపాటలతో సందడి చేయగా, పెద్దలు ఆత్మీయంగా పలకరించుకుంటూ యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఒకేచోట కులబాంధవులంతా కలుసుకోవడంతో ఆత్మీయత, ఐక్యత వెల్లివిరిసింది.కార్తీక మాసంలో వనభోజనాలు నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మికతతో పాటు సామాజిక ఐక్యత, కుటుంబ బంధాలు మరింత బలపడతాయని పలువురు పేర్కొన్నారు. సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆనందదాయకమని తెలిపారు.



ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బుర్ర రమాదేవి సదానందం, మాజీ కౌన్సిలర్ ముంజాల రవీందర్, మాజీ జెడ్పిటిసి కంకటి రాజవీరు, లారీ అసోసియేషన్ అధ్యక్షులు పులి వేణు, ఏపీఓ సునిత, హనుమాన్ దేవాలయ కమిటీ చైర్మన్ నాగపురి సమ్మయ్య, నాయకులు, ఉద్యోగులు బుర్ర కుమారస్వామి, పెరుమాండ్ల తిరుపతి, ముత్యాల రాజబాబు,
తడుక సుధాకర్, తాళ్లపల్లి శ్రీనివాస్, కోల తిరుపతి తో పాటు వివిధ గౌడ సంఘాల నాయకులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.



రామప్ప ఆయకట్టు యాసంగిపై సందిగ్ధం

■ సరస్సులో 30 అడుగుల పైగా నీరు నిల్వ



వెంకటాపూర్ రామప్ప నవంబర్ 26 (పీపుల్స్ న్యూస్) :పాలంపేట మండలంలోని ప్రసిద్ధి చెందిన రామప్ప సరస్సు ఆయకట్టు రైతులకు యాసంగి సాగుపై సందిగ్ధం నెలకొంది.
సరస్సులో ప్రస్తుతం 30 అడుగుల పైగా నీరు నిల్వ ఉండటంతో యాసంగి వరి సాగు చేసుకునేందుకు రైతులు ఆశలు పెంచుకున్నారు. అయితే ఇప్పటివరకు ప్రభుత్వం యాసంగి సాగుపై అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో రైతుల్లో అయోమయం నెలకొంది.రామప్ప సరస్సు ద్వారా సుమారు 6 వేల ఎకరాలకు రెండో పంటకు నీరు అందించే సామర్థ్యం ఉందని రైతులు చెబుతున్నారు. ప్రకటన వస్తే వరి నాట్లు వేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని, ఉపాధి కోసం కూలీలు కూడా ఎదురుచూస్తున్నారని అంటున్నారు.
ప్రభుత్వ ప్రకటన కోసం రైతాంగం నిరీక్షిస్తోంది.

ములుగులో జప్తు వాహనాల వేలం - 28న

ములుగు జిల్లా ప్రతినిధి నవంబర్ 26 (పీపుల్స్ న్యూస్) :ములుగు వివిధ ఎక్సైజ్ కేసుల్లో జప్తు చేసిన 14 ద్విచక్ర వాహనాలను ఈ నెల 28వ తేదీ ఉదయం 11 గంటలకు ములుగు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ లో వేలం వేయనున్నట్లు ఎస్సైఓ తెలిపారు. వేలంలో పాల్గొన దలచిన వారు ఉదయం 10 గంటల నుండి దరవత్తు రుసుంచెల్లించి పాల్గొనవచ్చని తెలిపారు.

అమృత్ సరోవర్ కుంటల వద్ద వి బి జి రాంజీ కూలీలచే ఘనంగా రాజ్యాంగ దినోత్సవం





వెంకటాపూర్ , నవంబర్ 26 (పీపుల్స్ న్యూస్) :భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం లక్ష్మీదేవి పేట ,వెంకటాపూర్, లక్ష్మీపురం గ్రామాలలో అమృత్ సరోవర్ కుంటల వద్ద వివిజి రాంజీ ఉపాధి కూలీలు రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.1949 నవంబర్ 26న రాజ్యాంగ పరిషత్తు భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన చారిత్రాత్మక రోజును గుర్తుచేసుకుంటూ ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి పేట పంచాయతీ సెక్రటరీ నాగరాజు, ఉపసర్పంచ్ కొండ తిరుపతి కూలీలను ఉద్దేశించి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన హక్కులు, బాధ్యతలు, సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం వంటి రాజ్యాంగ విలువల ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తిని గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు కేతిరి రాధిక, నల్లబెల్లి భాస్కర్, బూరుగుపేట ఫీల్డ్ అసిస్టెంట్ సారంగపాణి, వెంకటాపూర్ ఫీల్డ్ అసిస్టెంట్ రామాచారి, వి విజి రాంజీ మెట్లు కూలీలు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

■ గోదావరి జలాలను లక్నవరం సరస్సులోకి మళ్లించాలి
■ గోవిందరావుపేట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులు, కూలీలను ఆదుకోవాలి
■ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



ములుగు గోవిందరావుపేట, నవంబర్ 26(పీపుల్స్ న్యూస్) :
రైతులు ఎంతో కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం గోవిందరావుపేట మండల అధ్యక్షుడు గుండు రామస్వామి, కార్యదర్శి తీగల ఆగిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం గోవిందరావుపేట మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల సమస్యల పరిష్కారం కోసం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కుసుమ రవీందర్‌కు రైతుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ గోవిందరావుపేట మండలంలోని అనేక గ్రామాల్లో రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు లేక కల్లాల్లోనే రాశులుగా పేరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం చేతికి వచ్చిన సమయంలోనే కొనుగోలు కేంద్రాలు సక్రమంగా పనిచేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఒకవైపు అకాల వర్షాలు, మరోవైపు వాతావరణ మార్పుల భయంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రతి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి, రైతులు పండించిన మొత్తం ధాన్యాన్ని ఎలాంటి జాప్యం లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.
కరువు పరిస్థితులను గుర్తించి రైతులు, వ్యవసాయ కూలీలను ఆదుకోవాలి
ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని నాయకులు పేర్కొన్నారు. గోవిందరావుపేట మండలంలో నెలకొన్న పరిస్థితులను ప్రభుత్వం పరిశీలించి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరారు. పంట నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని, వ్యవసాయ పనులు లేక ఉపాధి కోల్పోయే వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.
గోదావరి జలాలను లక్నవరం సరస్సుకు మళ్లించి రెండు పంటలకు సాగునీరు అందించాలిములుగు నియోజకవర్గం సమీపంలోనే గోదావరి నది ప్రవహిస్తున్నప్పటికీ ఈ ప్రాంత రైతాంగానికి సాగునీరు అందకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని నాయకులు విమర్శించారు. గోదావరి జలాలను లక్నవరం సరస్సులోకి మళ్లించే విధంగా శాశ్వత సాగునీటి ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టు ద్వారా గోవిందరావుపేట మండలంతో పాటు పరిసర ప్రాంతాల రైతులకు సాగునీరు అందించి రెండు పంటలు పండించుకునే అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
అదేవిధంగా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించేలా కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని కోరారు. సాగు చేస్తున్న ప్రతి రైతుకు భూమిపై హక్కులు కల్పించడంతో పాటు అర్హులైన రైతులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
ఈ ధర్నాకు సీఐటీయూ ములుగు జిల్లా సహాయ కార్యదర్శి సోమ మల్లారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పొదిల చిట్టిబాబు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల మురళి మద్దతు ప్రకటించి మాట్లాడుతూ రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కమిటీ సభ్యులు క్యాతం సూర్యనారాయణ, గుండు లెనిన్, కట్ట వెంకటేశ్వరరావు ,కాప కోటేశ్వరరావు, నిమ్మల బిక్షం, మంచాల కవిత, బ్రహ్మచారి, కొమ్ము రాజు, అశోక్, శ్రీను, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ ఆఫీసర్లు మెరుగైన వైద్య సేవలు అందించాలి



■ డాక్టర్ చంద్రశేఖర్



ములుగు జిల్లా ప్రతినిధి నవంబర్ 26 (పీపుల్స్ న్యూస్) :ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో ఏకంగా 119 నర్సింగ్ ఆఫీసర్లు నియామకం కావడంతో మెరుగైన వైద్య సేవలు అందించడానికి అవకాశం లభించిందని, నర్సింగ్ ఆఫీసర్లు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్ అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా నియామకమైన నర్సింగ్ ఆఫీసర్లకు బ్యాడ్జింగ్ , క్యాపింగ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున నియామకాలు నిర్వహించి ఇక్కడి ఆసుపత్రికి కేటాయించడం వైద్య రంగంలో చారిత్రాత్మక మైలురాయి అని అభివర్ణించారు.
ములుగు జిల్లా వైద్యారోగ్య చరిత్రలో ఒక నూతన అధ్యాయానికి నాందిగా నిలిచిపో తుందని, వార్డులు, అత్యవసర ట్రామా విభాగాలు, ఆపరేషన్ థియేటర్లు, క్రిటికల్ కేర్ విభాగాలలో రోగులకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో వీరి పాత్ర ఎంతో కీలకమని అన్నారు.
నర్సింగ్ ఆఫీసర్లు రోగుల పట్ల ఓర్పు, కరుణ, అప్రమత్తత మరియు వృత్తిపరమైన నిబద్ధతతో వ్యవహరించాలని సూచించారు.
కార్యక్రమంలో ఆసుపత్రి ఇన్‌ఛార్జ్ చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ పి. బేబీ సరళ, డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్లు పి. రమాదేవి, ఎ. యాకమ్మ , నర్సింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

సీతక్క వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఘాటు విమర్శలు

■ కేటీఆర్‌పై వ్యక్తిగత దాడులు మాని ప్రభుత్వ వైఫల్యాలకు సమాధానం చెప్పాలి
■ బి ఆర్ ఎస్ సీనియర్ నాయకుడు మల్క రమేష్



వెంకటాపూర్ నవంబర్ 26 (పీపుల్స్ న్యూస్) :మంత్రి సీతక్క కేటీఆర్‌పై చేస్తున్న విమర్శలను బీఆర్ఎస్ ములుగు జిల్లా సీనియర్ నాయకుడు మల్క రమేష్ తీవ్రంగా ఖండించారు.గురువారం ఆయన వెంకటాపూర్‌లో మీడియాతో మాట్లాడారు... కేటీఆర్ ఉన్నత విద్యను అభ్యసించి ప్రజాసేవను లక్ష్యంగా చేసుకుని రాజకీయాల్లో కొనసాగుతున్న నాయకుడని, పేద ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టిన వ్యక్తిపై వ్యక్తిగత విమర్శలు చేయడం రాజకీయ అహంకారానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. సంక్షేమ శాఖ మంత్రిగా సీతక్క ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రూ.2,016 పెన్షన్‌ను రూ.4,000 చేస్తామన్న హామీ ఏమైందని, అవ్వాతాత ఇద్దరికీ పెన్షన్, ఒంటరి మహిళలకు పెన్షన్, వికలాంగుల పెన్షన్ల పెంపుపై ప్రభుత్వం ఎందుకు స్పష్టత ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామన్న హామీ ఇప్పటికీ అమలు కాలేదని, రైతులకు పెట్టుబడి సాయం సకాలంలో అందడం లేదని ఆరోపించారు. మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఇందిరమ్మ చీరల పేరుతో సభలు, సమావేశాలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రైతు బీమా, రైతుబంధు తరహా పథకాల విషయంలో రైతులకు ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేయాలని, వర్షాలు పడి పంటలు పండితే అది ప్రభుత్వ గొప్పతనం కాదని, కరువు పరిస్థితుల్లోనూ రైతుల పొలాలకు సాగునీరు అందించి పంటలు పండించేలా చేయడమే నిజమైన పాలన అని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్ని దుష్ప్రచారాలు చేసినా ప్రజలు వాస్తవాలను అర్థం చేసుకుంటున్నారని తెలిపారు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ప్రస్తుతం మంత్రిగా కొనసాగుతున్న సీతక్క ములుగు జిల్లాకు చేసిన శాశ్వత అభివృద్ధి ఏమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ భవనాల నిర్మాణం, గ్రామీణ రహదారుల అభివృద్ధి, తాగునీటి సమస్యల పరిష్కారం, సాగునీటి సదుపాయాల కల్పనలో సాధించిన ఫలితాలేమిటో చెప్పాలన్నారు. కాంట్రాక్టు పనుల్లో అవినీతి, కమిషన్ల ఆరోపణలపై విచారణ జరిపించే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులకు పనులు అప్పగించి నాణ్యతలేని పనులు చేస్తున్నారనే ఆరోపణలకు సమాధానం చెప్పాలని, 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో రైతులకు, పేద ప్రజలకు ఏం చేశారో వివరించాలని అన్నారు. కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధికి, ప్రస్తుత కాంగ్రెస్ పాలనకు మధ్య ఉన్న తేడాను ప్రజలు స్పష్టంగా గమనిస్తున్నారని పేర్కొన్నారు. కేటీఆర్‌ను విమర్శించడం కాదు,
ప్రభుత్వ పనితీరుపై ప్రజలకు సమాధానం చెప్పాలని, ములుగు జిల్లా అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని మల్క రమేష్ సవాల్ విసిరారు.

భారత రాజ్యాంగ దినోత్సవం

బాలానగర్ నవంబర్ 26 (పీపుల్స్ న్యూస్) :
భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా... టి పిసిసి ఆధ్వర్యంలో హైదరాబాద్ లో నిర్వహించిన సంవిధాన్ రక్షక్ ర్యాలీ సందర్భంగా ట్యాంక్ బండ్ వద్ద ఉన్న, రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి ఘన నివాళులు అర్పించిన కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మదన్ మోహన్, బాలానగర్ డివిజన్ అధ్యక్షుడు పులి శివకుమార్ గౌడ్, సత్యపాల్ రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, సదా గౌడ్,దండు రవి గౌడ్, బి.యస్. కుమార్ మరియు మహిళ నేతలు...



అక్రమ నిర్మాణాలపై మౌనం..

వసూళ్ల ఆరోపణల్లో ఏసీపీ సుమిత్ర పేరు!

- అక్రమ నిర్మాణాలపై కొరడా ఝళిపించాల్సిన ఏసీపీకి కనిపించేది వసూళ్ల వ్యవహారాలేనా?
- బిల్డర్ల అక్రమాలకు అడ్డుకట్ట వేయలేని అధికారి కుర్చీలో కొనసాగడం ఎందుకు?
- నిర్మాణాలు పెరుగుతున్నాయి.. ఫిర్యాదులు మూతపడుతున్నాయి.. అధికారుల బాధ్యత మాత్రం ఎక్కడ?
- అక్రమ నిర్మాణాలపై చర్యలు శూన్యం.. వసూళ్ల ఆరోపణలపై సమాధానం కరువు!
- టౌన్‌ప్లానింగ్ కార్యాలయం ప్రజల కోసమా? నిర్మాణదారుల ప్రయోజనాల కోసమా?
- అనుమతుల ఉల్లంఘనలు పట్టించుకోరా? ఫిర్యాదులను మూసేసి చేతులు దులుపుకుంటారా?
- బిల్డర్లకు కొమ్ముకాస్తున్నారన్న ఆరోపణలు.. ఏసీపీ సుమిత్రపై విచారణకు వెనుకడుగు ఎందుకు?
- అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన వ్యవస్థే ఆరోపణల వలయంలో చిక్కుకుందా?
- ఫిర్యాదుదారుల గోడు పట్టదా? నిర్మాణదారుల పలుకుబడే పనిచేస్తోందా?
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్న చట్టం.. సర్కిల్--57లో మాత్రం అమలేది?
- అధికారుల మౌనంతో అక్రమ నిర్మాణదారులకు ధైర్యం పెరుగుతోందా?
- వసూళ్ల ఆరోపణలపై విచారణ జరగకపోతే ప్రజలకు అధికారులపై నమ్మకం ఎలా కలుగుతుంది?
- ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకత ఏది? తనిఖీ నివేదికలు ప్రజలకు ఎందుకు అందుబాటులో లేవు?
- ఏసీపీపై ఆరోపణలు వస్తున్నా ఉన్నతాధికారుల మౌనం.. ఇది బాధ్యతారాహిత్యం కాదా?
- సర్కిల్--57లో చట్టానికి విలువ లేదా? అధికారుల జవాబుదారీతనం ఎక్కడ?







టౌన్ ప్లానింగ్ ఏసిపి సుమిత్ర

కుత్బుల్లాపూర్, నవంబర్ 26 (పీపుల్స్ న్యూస్) :గాజులరామారం సర్కిల్--57 టౌన్‌ప్లానింగ్ విభాగంలో అక్రమ నిర్మాణాల వ్యవహారం రోజురోజుకూ వివాదాస్పదంగా మారుతోంది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదులు వస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎందుకు కఠిన చర్యలు తీసుకోవడం లేదన్న ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సుమిత్ర వ్యవహారశైలిపై వసూళ్లకు సంబంధించిన ఆరోపణలు వినిపిస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

● అక్రమ నిర్మాణాలపై చర్యలేవి?

సర్కిల్--57 పరిధిలో అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయంటూ పలుమార్లు ఫిర్యాదులు అందుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో నిర్మాణాలను పరిశీలించి, ఉల్లంఘనలు గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ విభాగం ఎందుకు మౌనంగా ఉంటోందన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఫిర్యాదులు అందినప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నారా? ఉల్లంఘనలు గుర్తిస్తే ఎందుకు చర్యలు కనిపించడం లేదు? అన్న ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది.

● ఏసీపీ సుమిత్రపై వసూళ్ల ఆరోపణలు..

విచారణ ఎప్పుడు?

సర్కిల్--57లో అక్రమ నిర్మాణాల విషయంలో ఏసీపీ సుమిత్ర ది వ్యవహారంపై స్థానికంగా తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. వసూళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నారన్న ఆరోపణలు నిజమా? లేక ఇవి నిరాధార ప్రచారమా? అన్నది తేలాల్సి ఉంది. ఆరోపణలను నిజమని ముందుగానే నిర్ధారించలేం. అయితే ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు స్వతంత్రంగా విచారణ జరిపించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.

● బిల్డర్లకు వెసులుబాటు..

సామాన్యులకు నిబంధనలా?

చిన్నపాటి నిర్మాణాల్లో నిబంధనల పేరుతో సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తూ, పెద్ద నిర్మాణాల విషయంలో మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చట్టం అందరికీ సమానంగా వర్తించాలి. నిర్మాణదారుల స్థాయి, పలుకుబడి ఆధారంగా చర్యల్లో తేడా ఉంటే అది అధికార వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తుంది.

● కమిషనర్ జోక్యం చేసుకోవాలి!

సర్కిల్--57 పరిధిలోని ఫిర్యాదులు, తనిఖీ నివేదికలు, నిర్మాణ అనుమతులు, ఫిర్యాదుల ముగింపు ప్రక్రియపై ఉన్నతాధికారులు సమగ్రంగా పరిశీలించాలి. ఏసీపీ సుమిత్రపై వస్తున్న వసూళ్ల ఆరోపణలపైనా నిష్పక్షపాత విచారణ జరిపించాలి. ఆరోపణల్లో వాస్తవాలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. అక్రమ నిర్మాణాలపై మౌనం వీడి, నిబంధనలను సమానంగా అమలు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రేషన్ లబ్ధిదారులకు తీపి కబురు..

సన్నబియ్యంతోపాటు నిత్యావసర సరుకులు..!

ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో ఆహారధాన్యాల కొరత తలెత్తకుండా తెలంగాణ ప్రభుత్వం అలర్ట్ అయింది. కనీసం 15 నెలలకు సరిపడా సన్నబియ్యం బఫర్ నిల్వలు ఏర్పాటు చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సన్నబియ్యంతో పాటుగా పేద ప్రజలకు రేషన్ సరుకులు అందించే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ఐదు నెలల్లో రూ.10 వేల కోట్లతో జలవనరుల అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పుకొచ్చారు.

ఈ ఏడాది ఎల్ నినో కారణంగా ఆశించినంతగా వర్షాలు కురవలేదు. దాదాపు కరువు పరిస్థితులు నెలకున్నాయి. రానున్న రోజుల్లోనూ వర్షపాతం తగ్గి వ్యవసాయ ఉత్పత్తులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలకు సిద్ధమవుతోంది. సన్న బియ్యం సరఫరాకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆ శాఖ అధికారులను ఆదేశించారు. కనీసం 15 నెలలకు సరిపడా సన్నబియ్యం బఫర్ నిల్వలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం రాష్ట్ర అవసరాలకు సరిపడా సుమారు 14 నెలల సన్నబియ్యం నిల్వలు అందుబాటులో ఉన్నాయని అయినా వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని మరో నెలకు సరిపడా నిల్వలను అదనంగా సమకూర్చుకోవాలన్నారు.

ఎల్‌నినో పరిస్థితుల కారణంగా రానున్న రోజుల్లో ధాన్యం ఉత్పత్తి, సేకరణపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ మేరకు ఇప్పటి నుంచే ఆహారధాన్యాల నిల్వలను పెంచుకోవాలని అధికారులను ఆదేశించారు. ముందస్తు చర్యల ద్వారా రానున్న 15 నెలల పాటు రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు బియ్యం పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడవచ్చునని స్పష్టం చేశారు.రైతులు సన్నరకాల సాగు చేపట్టేలా ప్రోత్సహించడంతోపాటు కొనుగోలు కేంద్రాల్లో సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించారు. క్వింటాకు రూ.500 బోనస్ వర్తించే



ఏడు రకాల సన్నధాన్యాల వివరాలను కొనుగోలు కేంద్రాల వద్ద ప్రచారం చేయాలని సూచించారు. రైతులకు ఏయే రకాల ధాన్యానికి బోనస్ లభిస్తుందనే విషయంపై స్పష్టత కల్పిస్తే సన్నధాన్యం సాగుపై వారికి పూర్తి అవగాహన ఉంటుందన్నారు.

రేషన్ బియ్యంతో పాటు నిత్యావసర సరుకులుకాగా, తెలంగాణలోని నిరుపేదలకు రేవంత్ సర్కార్ మరో తీపి కబురు చెప్పేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం రేషన్ దుకాణాల ద్వారా అందిస్తున్న సన్న బియ్యంతోపాటు మరిన్ని నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం నిత్యావసర సరుకుల ధరలు సైతం ఆకాశాన్ని తాకుతుండగా.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ధరల భారం తగ్గించేలా ఏయే వస్తువులను రేషన్ ద్వారా అందించేందుకు వీలుంటుందో అధ్యయనం చేయాలని సూచించారు. అధికారులు రూపొందించే ప్రతిపాదనలను మంత్రివర్గ ఉపసంఘం ముందుంచి రేషన్ సరుకుల పంపిణీపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు వివరించారు. గతంలోనూ రేషన్ ద్వారా బియ్యంతోపాటు పప్పు, నూనె, చింతపండు, కారం, చక్కెర, గోధుమపిండి వంటి నిత్యావసరాలను అందించే ప్రతిపాదనలు చర్చకు వచ్చినట్లు గుర్తు చేశారు.

10 లక్షల టన్నుల సామర్థ్యంతో సైలో గోదాములురాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి, ప్రభుత్వ కొనుగోళ్లు గణనీయంగా పెరుగుతున్నప్పటికీ అందుకు అనుగుణంగా గోదాముల నిల్వ సామర్థ్యం పెరగకపోవడం సమస్యగా మారిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ప్రస్తుతం ధాన్యం నిల్వ సదుపాయాలు సరిపోకపోవడంతో ప్రైవేటు రైస్‌మిల్లర్లపై ఆధారపడాల్సి వస్తోందని అన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల టన్నుల సామర్థ్యంతో ఆధునిక సైలో గోదాములు నిర్మించాలని ప్రతిపాదించారు. ధాన్యం సేకరణ ఎక్కువగా జరిగే పది ప్రధాన కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందుకు అవసరమైన నిధుల సమీకరణపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. పౌరసరఫరాల సంస్థ అంతర్గత నిధులతోపాటు తక్కువ వడ్డీ రేట్లకు ఆర్థిక సంస్థల నుంచి రుణాలు పొందే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు.

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు రూ.10 వేల కోట్ల కార్యాచరణమరోవైపు ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు నీటిపారుదల శాఖ కూడా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తుందని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. తొలివిడతలో రూ.2 వేల కోట్లతో చేపట్టనున్న పనులను రానున్న సంక్రాంతి తర్వాత ప్రారంభించనున్నట్లు తెలిపారు. చెరువులు, వాగులు, కాలువల పునరుద్ధరణ, గ్రౌండ్ వాటర్ రీఛార్జ్, వర్షపునీటి సంరక్షణ, గ్రామీణ ప్రాంతాల్లో జలవనరుల అభివృద్ధికి ఈ నిధులను వెచ్చించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఐదు నెలల్లో రూ.10 వేల కోట్లతో ఎల్‌నినో నివారణ, ప్రభావ నియంత్రణ పనులు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి డిసైడ్ అయినట్లు మంత్రి ఉత్తమ్ వెల్లడించారు.

రామప్ప దేవాలయంను సందర్శించిన జపాన్ దేశస్తులు





వెంకటాపురం రామప్ప నవంబర్ 26 (పీపుల్స్ న్యూస్) :మండలం లోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్ని గురువారం జపాన్ దేశానికి చెందిన టోమోకీ టజానా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉఉమాశంకర్ వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారికి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ ఆలయ చరిత్ర, శిల్పకళ వైభవం, కాకతీయుల చరిత్ర గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ అమెజింగ్ టెంపుల్ అని కోనియాడారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి పర్యాటక శాఖ బోట్లలో బోటింగ్ చేశారు. వారి వెంట ఈవో ఇమ్మడి భాస్కర్, టూరిస్ట్ పోలీసులు అరుణ్, శ్రీకాంత్, బద్రు, పురావస్తు, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇల్లు కట్టుకుంటే కులం పేరుతో అవమానమా?

- ఆకినపల్లిలో అగ్రవర్ణ అహంకారానికి నిదర్శనం
- దళిత మహిళ ఆత్మగౌరవంపై దాడి..కటంగూరి రాంనర్సింహారెడ్డిపై వెంటనే అట్రాసిటీ కేసు నమోదు చేయాలి
- దళితులపై అగ్రవర్ణ కులాల దాడులు ఇంకెన్నాళ్లు?
- ఆకినపల్లి ఘటనపై మాదిగ హక్కుల దండోరా ఆగ్రహం



మొగుళ్ళ పల్లి ప్రతినిధి నవంబర్ 26 (పీపుల్స్ న్యూస్) :తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వచ్చినా, గ్రామాల్లో దళితులపై, ముఖ్యంగా దళిత మహిళలపై అగ్రవర్ణాల పెత్తందారీ దాడులు, కుల అహంకార దాడులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయనడానికి ఆకినపల్లి ఘటనే నిదర్శనం. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం ఆకినపల్లి గ్రామంలో దూదపాక మమత అనే దళిత మహిళకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. ఆ పేద మహిళ తన సొంత ఇంటిని నిర్మించుకుంటుంటే చూసి ఓర్వలేక, కక్షగట్టి, కులం పేరుతో అత్యంత జుగుప్సాకరంగా అవమానించారు. ఈనెల 23న వార్డు సభ్యుడు నేర్పటి రాజ్ కుమార్ ఫోన్ చేసి గ్రామ పంచాయతీకి పిలిపించగా, భర్తతో కలిసి వెళ్లిన ఆ మహిళను ఉపసర్పంచ్ మెట్టు పవన్ సర్పంచ్ ఇంటికి పంపించాడు. అక్కడ సర్పంచ్ లేకపోవడంతో, ఆమె బావ అయిన మాజీ పోలీసు అధికారి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కటంగూరి రాంనర్సింహారెడ్డి అనుచరులతో ఉన్నాడు. "సర్పంచ్ రమ్మన్నారని వచ్చాము దొరా" అని ఆ అమాయక మహిళ అనగానే, "ఈ గ్రామానికి అన్నీ నేనే, నన్ను కాదని ఏ పని జరగదు" అంటూ అధికార దర్పం ప్రదర్శిస్తూ, ఆమె కులాన్ని కించపరుస్తూ, మాదిగ కులం పేరుతో అసభ్యంగా, బూతులు తిడుతూ, "నీ ఇందిరమ్మ ఇల్లు రద్దు చేయిస్తా" అంటూ బెదిరింపులకు దిగాడని బాధితురాలు కన్నీళ్లతో తెలిపింది. ఒక దళిత మహిళను అలా తిడుతుంటే పక్కనే ఉన్న అనుచరులు వారించకుండా వెకిలి నవ్వులు నవ్వడం, ఆ గ్రామంలో బహుజనుల పట్ల ఎంతటి వివక్ష, ఎంతటి అణచివేత ఉందో స్పష్టం చేస్తోంది. ఇది ఒక్క మమతపై జరిగిన దాడి కాదు, యావత్ బహుజన సమాజ ఆత్మగౌరవంపై జరిగిన దాడి. ఈ దారుణాన్ని తీవ్రంగా ఖండిస్తున్న మాదిగ హక్కుల దండోరా జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ, ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షులు దూదపాక రాజు ఆకినపల్లి గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. "కులం పేరుతో ఒక దళిత మహిళను బహిరంగంగా దూషించి, అవమానించడం రాజ్యాంగ విరుద్ధం, అమానుషం. ఇలాంటి అగ్రవర్ణ అహంకారంతో వ్యవహరించే కటంగూరి రాంనర్సింహారెడ్డిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలి. బాధితురాలు ఫిర్యాదు చేసి రెండు రోజులు అవుతున్నా పోలీసులు కేసు నమోదు చేయకపోవడం వెనుక రాజకీయ ఒత్తిడి ఉందా? అని అనుమానం వ్యక్తం చేస్తున్నాం. ఇకనైనా జిల్లా ఎస్పీ, కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలి. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు, రాస్తారోకోలు చేపడతామని" హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ కమిటీ అధ్యక్షులు దూదపాక రమేష్, అంబేద్కర్ సంఘం నాయకులు దూదపాక భద్రయ్య, డీఎస్పీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కడుపు నింపేందుకు చెట్టెక్కితే..కన్ను పోయింది, నడుము విరిగింది!

- ఆసుపత్రి బెడ్ పై నరకయాతన అనుభవిస్తున్న పేద గౌడన్న..ఆకలి కేకలతో ఆ కుటుంబం విలవిల!
- ఒకవైపు కంటి ఆపరేషన్..మరోవైపు స్పైన్ సర్జరీ..లక్షలు లేక ప్రాణాలతో పోరాటం..దయచూపండి!



మొగుళ్ళ పల్లి ప్రతినిధి నవంబర్ 26 (పీపుల్స్ న్యూస్) :ఆకలి తీర్చేందుకు తాటి చెట్టెక్కిన ఆ పేదోడి బతుకు ఇప్పుడు ఆసుపత్రి బెడ్ పైనే వేలాడుతోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండలం బంగ్లాపల్లి గ్రామానికి చెందిన బుర్ర రాజు గౌడ్ అనే గీతా కార్మికుడు (45) తన పిల్లలకు కడుపు నింపాలని, కుటుంబాన్ని పోషించాలని ప్రతిరోజూ ప్రాణాలను పణంగా పెట్టి తాటి చెట్టు ఎక్కే గౌడన్న, ఐదు అడుగుల ఎత్తు నుండి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. పడిన దెబ్బకు ఒక కన్ను దెబ్బతిని చూపు మసకబారింది. వెన్నెముక ఫ్రాక్చర్ అయ్యి, నడుము విరిగి లేవలేని స్థితిలో ఉన్నాడు. వైద్యులు స్పైన్ లో తీవ్రమైన దెబ్బ తగిలిందని, వెంటనే స్పైన్ సర్జరీ (వెన్నుపూస శస్త్రచికిత్స) చేయకపోతే జీవితాంతం మంచానికే పరిమితమవుతాడని హెచ్చరించారు. గౌడన్న ఒక సాధారణ గీత కార్మికుడు. రోజు గీస్తేనే పూట గడిచే కుటుంబం. ఇప్పుడు చేతులు విరిగి, కన్ను పోయి ఆసుపత్రిలో ఉంటే, ఇంట్లోని కుటుంబ సభ్యులు ఆకలితో అలమటిస్తున్నారు. ఆసుపత్రి ఖర్చులకు డబ్బులు లేక, ఆపరేషన్లకు లక్షలు కావాలని వైద్యులు చెప్పడంతో ఆ కుటుంబం కన్నీటి పర్యంత మవుతోంది. ప్రస్తుతం గౌడన్నకు అత్యవసర వైద్య చికిత్స అవసరం ఉంది. మీరు ఇచ్చే రూ.100, రూ.200 కూడా ఆ పేదోడి ప్రాణాలను కాపాడుతుంది. దయచేసి మానవత్వంతో స్పందించి ఆదుకోండి.
సాయం చేయదలచిన దాతల కోసం:
Phone Pay/ Gpay No:- 9912438622-LAVANYA BURRA కు పంపించండి.
ఆదుకున్న ప్రతి ఒక్కరికీ ఆ కుటుంబం జీవితాంతం రుణపడి ఉంటుంది.

ఇద్దరు ఆడపిల్లల భవిష్యత్తు కోసం కదిలిన 25 ఏళ్ల నాటి స్నేహం

- పలువురిని కంటతడి పెట్టించిన మొగుళ్లపల్లి మిత్రుల మైత్రీ బంధం!
- మృతి చెందిన మిత్రుని కుటుంబానికి రూ.29,500 ఆర్థిక సాయం
- జీవితాంతం అండగా ఉంటామని భరోసా!



మొగుళ్ళ పల్లి ప్రతినిధి నవంబర్ 26 (పీపుల్స్ న్యూస్) :స్నేహానికి వయసు లేదు, మరణం లేదని నిరూపించారు మొగుళ్లపల్లి జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు. మొగుళ్లపల్లి మండలం ములకలపల్లి గ్రామానికి చెందిన ఓనపాకల రాంచందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు చిన్న ఆడపిల్లలు ఉన్నారు. పిల్లలిద్దరు చాలా చిన్నవారు కావడంతో, కుటుంబానికి ఆధారమైన వ్యక్తిని కోల్పోయి ఆ కుటుంబ పరిస్థితి దయనీయంగా మారింది. ఇద్దరు ఆడపిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారి, ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. ఈ హృదయ విదారక పరిస్థితిని తెలుసుకున్న 1999-2000 సంవత్సరంలో మొగుళ్లపల్లి జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు చలించిపోయారు. పాతికేళ్లు గడిచినా తమ స్నేహ బంధం చెక్కుచెదరలేదని నిరూపిస్తూ, తమ మిత్రుని ఇద్దరు కూతుళ్ల భవిష్యత్తు కోసం ముందుకు వచ్చారు. తమ వాట్సాప్ గ్రూప్ ద్వారా మొత్తం రూ.29,500 ఆర్థిక సహాయాన్ని సేకరించి, మృతుని కుటుంబానికి అందజేశారు. కేవలం ఆర్థిక సాయమే కాదు, "నాన్న లేని ఆ చిన్నారులకు జీవితాంతం అండగా ఉంటాం, వారి చదువు, భవిష్యత్తుకు అన్ని విధాలుగా ఆసరాగా ఉంటాం" అని ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ సంఘటన మండలంలోని పలువురిని కంటతడి పెట్టించింది. మిత్రుడు మరణించినా స్నేహం మరణించదని, ఆ స్నేహం ఇద్దరు చిన్న ఆడపిల్లలకు రక్షణ కవచంగా నిలుస్తుందని నిరూపించిన మొగుళ్లపల్లి మిత్రులను గ్రామస్తులు, ఉపాధ్యాయులు, ప్రజలు అభినందిస్తున్నారు.

రూ.60 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన విద్యుత్ శాఖ అధికారి



- రూ.12.62 లక్షల బిల్లు మంజూరుకు లంచం డిమాండ్..కారులో డాష్‌బోర్డుపై నగదు పెట్టించిన అధికారి

హైదరాబాద్, క్రైమ్ బ్యూరో నవంబర్ 26 (పీపుల్స్ న్యూస్) :లంచం తీసుకుంటూ విద్యుత్ శాఖకు చెందిన ఓ అధికారి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డాడు. గద్వాల్ సబ్ డివిజన్ టీజీఎస్పీడీసీఎల్‌లో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న అన్నారపు రమేష్ బాబు రూ.60 వేల లంచం తీసుకుంటుండగా మహబూబ్‌నగర్ ఏసీబీ అధి కారులు గురువారం వలపన్ని పట్టుకున్నారు.ఫిర్యాదుదారుడు, అతని సహ కాంట్రాక్టర్ చేసిన పనులకు సంబంధించి రూ.12,62,070 బిల్లును మంజూరు చేసి, ప్రాసెస్ చేసేందుకు ప్రతిఫలంగా అధికారి రూ.60 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.ఉచ్చు నిర్వహణ సమయంలో అధికారి తన కార్యాలయ పనులు ముగించుకుని నివాసానికి వెళ్తుండగా, లంచం మొత్తాన్ని తన కారులోని డాష్‌బోర్డుపై ఉంచాలని ఫిర్యాదుదారుడికి సూచించాడు. అధికారి ఆదేశాల మేరకు ఫిర్యాదుదారుడు నగదును డాష్‌బోర్డుపై ఉంచడంతో ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.
అనంతరం రూ.60 వేల నగదును స్వాధీనం చేసుకున్న అధికారులు, ఏపీ07సీజెడ్4705 నంబరు గల అధికారి కారులోని డాష్‌బోర్డుపై రసాయన పరీక్షలు నిర్వహించగా పాజిటివ్‌గా తేలింది. అధికారిక హోదాను దుర్వినియోగం చేసి అక్రమంగా లంచం స్వీకరించినట్లు ఏసీబీ పేర్కొంది.నిందిత అధికారి అన్నారపు రమేష్ బాబును అరెస్టు చేసి, నాంపల్లిలోని ఎస్పీఈ, ఏసీబీ కేసుల మొదటి అదనపు ప్రత్యేక న్యాయ మూర్తి ఎదుట హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ వెల్లడించింది. ఫిర్యాదుదారుడి భద్రత దృష్ట్యా వివరాలను గోప్యంగా ఉంచినట్లు తెలిపింది.

- లంచం అడిగితే 1064కు ఫిర్యాదు చేయండి

ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. వాట్సాప్ నంబర్ 944044 6106 ద్వారా కూడా సమాచారం అందించవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 28న కిసాన్ మేళా



ములుగు జిల్లా ప్రతినిధి నవంబర్ 26 (పీపుల్స్ న్యూస్) :
ములుగు జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 28-11-2026 (శనివారం) ములుగు మండలంలోని జంగాలపల్లి క్రాస్ సమీపంలో గల ఇంచెర్ల గ్రామం ఎం.ఆర్. ఫంక్షన్ హాల్‌లో కిసాన్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.
ఈ కిసాన్ మేళాలో వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు వివిధ పంటల సాగులో అనుసరించాల్సిన ఆధునిక పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, అధిక దిగుబడులు సాధించేందుకు పాటించాల్సిన మెళకువలపై అవగాహన కల్పించనున్నారు. ముఖ్యంగా నూనెగింజల పంటలు, చిరుధాన్యాల సాగు ప్రాముఖ్యత, వాటి సాగులో అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించనున్నారు.అదేవిధంగా, వరంగల్ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పులు, వాటి ప్రభావం వ్యవసాయ రంగంపై ఎలా ఉంటుందనే అంశాలతో పాటు, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు చేపట్టాల్సిన ముందస్తు వ్యవసాయ చర్యలపై ప్రత్యేక సూచనలు, సలహాలు అందించనున్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు, ఆధునిక వ్యవసాయ పనిముట్లు, నూతన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు. రైతులు ఈ స్టాళ్లను సందర్శించి ఆధునిక వ్యవసాయ పరికరాల పనితీరు, వాటి వినియోగం, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పొందవచ్చు.అలాగే రైతులు తమ పంటల సాగులో ఎదుర్కొంటున్న సమస్యలు, చీడపీడల నివారణ, ఎరువుల సమతుల్య వినియోగం, పంటల యాజమాన్య పద్ధతులు, దిగుబడుల పెంపు తదితర అంశాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలను నేరుగా సంప్రదించి తగిన సలహాలు, సూచనలు పొందవచ్చు. రైతులు అడిగే సందేహాలను నివృత్తి చేయడంతో పాటు, సమస్యల పరిష్కారానికి శాస్త్రీయమైన మార్గాలను శాస్త్రవేత్తలు వివరించనున్నారు.కావున ములుగు జిల్లాలోని రైతులందరూ ఈ నెల 28న నిర్వహించనున్న కిసాన్ మేళాకు పెద్ద సంఖ్యలో హాజరై, వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను సద్వినియోగం చేసుకొని ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్ కోరారు.

ఫతేనగర్ డివిజన్ పరిధిలోని వాల్మీకి నగర్ తాగునీటి సమస్య ఎప్పటికి తీరేను?

- హామీలకే పరిమితమైన తాగునీటి సరఫరా.. ట్యాంకర్లపైనే స్థానికుల ఆధారం....
- ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం శూన్యం.. అధికారుల తీరుపై స్థానికుల ఆవేదన



బాలానగర్ నవంబర్ 26 (పీపుల్స్ న్యూస్) :కూకట్‌పల్లి నియోజకవర్గం, ఫతేనగర్ డివిజన్ పరిధిలోని వాల్మీకి నగర్‌లో మంచినీటి సమస్య ఏళ్లుగా స్థానిక ప్రజలను వేధిస్తున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు కనీస అవసరమైన తాగునీరు కూడా సక్రమంగా అందకపోవడంతో ప్రతి రోజూ నీటి కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. కొందరు డబ్బులు చెల్లించి నీటి ట్యాంకర్లను తెప్పించుకుంటుండగా, మరికొందరు నీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. కాలనీలో ప్రజలకు అందుబాటులో ఉండే ప్రభుత్వ బోరు లేకపోవడం, వ్యక్తిగతంగా బోరు వేయించుకున్న ఇళ్లలోనూ భూగర్భ జలాలు అందుబాటులో లేకపోవడంతో నీటి కష్టాలు మరింత తీవ్రమయ్యాయని స్థానికులు చెబుతున్నారు.
గతంలో మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ప్రత్యేక చొరవ తీసుకుని కాలనీకి మంచినీటి సరఫరా కల్పించేందుకు ప్రధాన రహదారి వరకు నూతన పైపులైన్లు వేయించారు. అయితే అప్పట్లో కరోనా పరిస్థితుల కారణంగా పనుల్లో జాప్యం జరిగిందని స్థానికులు గుర్తుచేస్తున్నారు. అనంతరం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి పలుమార్లు సమస్యను తీసుకెళ్లి, మాజీ కార్పొరేటర్ సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో వినతులు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదని వాల్మీకి నగర్ వాసులు పేర్కొంటున్నారు. మరోవైపు మంచినీటి సరఫరా విభాగం అధికారులకు సైతం వాల్మీకి నగర్‌లోని పైపులైన్ల సమస్యపై సరైన అవగాహన లేదని, అసలు సమస్యను గుర్తించి పరిష్కరించకుండా తూతూ మంత్రంగా వ్యవహరిస్తూ సంబంధం లేని ఇతర సమస్యలను ప్రస్తావిస్తున్నారని స్థానికుడు అశోక్ చారి ఆరోపించారు. ప్రజల నీటి కష్టాలను అధికారులు, ప్రజాప్రతినిధులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.
మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ పదవీకాలం ముగియడంతో తమ సమస్యలను పట్టించుకునే వారు లేకుండా పోయారని వాల్మీకి నగర్ సంక్షేమ సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలు ఆచరణలో కనిపించడం లేదని విమర్శిస్తున్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఇప్పటికైనా ప్రత్యేక చొరవ తీసుకుని సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలన చేయించి, ఇప్పటికే వేసిన పైపులైన్లను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడంతో పాటు ప్రతి ఇంటికీ నిరంతర మంచినీటి సరఫరా అందేలా చర్యలు చేపట్టాలని వాల్మీకి నగర్ ప్రజలు కోరుతున్నారు. తమకు కావాల్సింది హామీలు కాదని, శాశ్వతంగా తీరే మంచినీటి సమస్యకు పరిష్కారమని స్పష్టం చేస్తున్నారు.

అపరమేధావి డా. గుగ్గిళ్ల దివ్యమూర్తి అభిమానుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



ఖమ్మం /నవంబర్ 26/(పీపుల్స్ న్యూస్) :సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల కేంద్రంలో గురువారం నాడు అపరమేధావి డా. గుగ్గిళ్ల దివ్యమూర్తి అభిమానుల సంఘం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అభిమానుల సంఘం అనంతగిరి మండల అధ్యక్షులు మద్దెల నాగేంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అపరమేధావి డా. గుగ్గిళ్ల దివ్యమూర్తి, మండల ఎమ్మార్వో పోలె కమలాకర్, డిప్యూటీ ఎమ్మార్వో శ్రీధర్లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తదనంతరం వారు కేక్ కటింగ్ చేసారు. ఈ సందర్భంగా గుగ్గిళ్ళ దివ్యమూర్తి మాట్లాడుతూ రాజ్యాంగం దేశానికి వెన్నెముకని ప్రజలకు రక్షణ కవచమని, రాజ్యాంగం ముందు అందరు సమానులేనని, ఎవరు ఎక్కువ కాదు ఎవరు తక్కువ కాదని, రాజ్యాంగాన్ని చదవడం విజ్ఞానం ఆచరించడం బాధ్యత అని, దేశ ఐక్యతకు పునాది రాజ్యాంగమని, రాజ్యాంగం ప్రతి పౌరుడికి ఆత్మగౌరవంతో జీవించే హక్కును కల్పిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అభిమానుల సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి మరికంటి వెంకటేశ్వర్లు, అభిమానుల సంఘం పాలేరు నియోజకవర్గ అధ్యక్షులు తోళ్ల వీరస్వామి, చిన్నం యిర్మియా ,జిపిఓ నరేష్, ములకలపల్లి ప్రభాకర్, కొత్తపల్లి శ్రీను, కర్ర రవి, ఉసిరికాయల కొండలు, ములకలపల్లి పావని, దివ్యమూర్తి అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ బోర్డును యథావిధిగా కొనసాగించాలి

- మాతృభాష తెలుగులోనే విద్యాబోధన సాగించాలి
- ఇంటర్మీడియట్ బోర్డు రద్దు నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలి
- సీనియర్ జర్నలిస్టు పొన్నాల గౌరీశంకర్



బాలానగర్ నవంబర్ 26 (పీపుల్స్ న్యూస్) :తెలుగు భాషకు ప్రాచీన భాషా హోదా లభించినప్పటికీ, తెలంగాణ రాష్ట్రంలో మాతృభాష తెలుగుకు తగిన ప్రాధాన్యం కల్పించకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ప్రాచీన భాషా హోదా సాధకుడు, ప్రజాహిత యాత్రికుడు పొన్నాల గౌరీశంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటర్మీడియట్ బోర్డును రద్దు చేసి పాఠశాల విద్యలో విలీనం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు.ఇంటర్మీడియట్ బోర్డును యథావిధిగా కొనసాగించాలని, విద్యాబోధనలో మాతృభాష తెలుగుకు సముచిత స్థానం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంటర్మీడియట్ బోర్డును రద్దు చేయడం వల్ల విద్యార్థులకు కలిగే ప్రయోజనాలు, నష్టాలపై సమగ్రంగా అధ్యయనం చేసిన తర్వాతే ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని సూచించారు. గతంలో స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో కాంగ్రెస్ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు ఆంగ్ల మాధ్యమానికి బదులుగా తెలుగు మాధ్యమంలో విద్యాబోధన జరగాలని ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. ఆనాడు 'ఆంగ్ల మాధ్యమం వద్దు.. తెలుగు భాష ముద్దు' అంటూ మాతృభాష పరిరక్షణ కోసం పోరాడిన నాయకుల ఆశయాలకు నేటి పాలకుల నిర్ణయాలు విరుద్ధంగా ఉన్నాయని విమర్శించారు.ఒకవైపు తెలుగు భాషకు ప్రాచీన భాషా హోదా కల్పించామని గొప్పగా చెప్పుకుంటూనే, మరోవైపు విద్యా వ్యవస్థలో తెలుగు భాషకు ప్రాధాన్యం తగ్గించేలా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. ఆంగ్ల భాషకు ప్రాధాన్యం ఇవ్వడం పేరుతో మాతృ భాషను నిర్లక్ష్యం చేయకూడదని హితవు పలికారు. విద్యార్థుల భవిష్యత్తు, తెలుగు భాష పరిరక్షణ, విద్యావ్యవస్థ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఇంటర్మీడియట్ బోర్డు రద్దు ప్రతిపాదనను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని పొన్నాల గౌరీశంకర్ డిమాండ్ చేశారు. తెలుగు భాషలోనే విద్యాబోధనకు పెద్దపీట వేసి మాతృభాష ఔన్నత్యాన్ని కాపాడాలని కోరారు.

రైతుల పట్ల నిర్లక్ష్యం..సమ్మిట్‌ల పేరిట ప్రజాధనం దుర్వినియోగం



: మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

మహబూబ్ నగర్ : రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యం చూపుతూ సమ్మిట్ ల పేరిట ప్రజాధనం దుర్వినియోగం చేస్తుందని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. మహబూబ్ నగర్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసి, కొట్టుకుపోయి రైతులు హరిగోస పడుతున్న పట్టించుకునే నాథుడు కూడా లేరని తీవ్రంగా విమర్శించారు.ప్రభుత్వం సాగు నీళ్లు, కరెంటు ఇవ్వకపోయినా,రైతు బంధు ఏగ్గొట్టినా ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి కూడా భద్రత కల్పించలేని ఆసమర్ధుడు రేవంత్ రెడ్డి అని నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించినా నేటికి ఒక్క బస్తా ధాన్యం కొనుగోలు చేయకపోవడం వల్ల ధాన్యం నీటి పాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎండిన పంటలకు,అకాల వర్షాల వల్ల తడిసిన కొట్టుకుపోయిన ధాన్యానికి నష్టపరిహారం చెల్లించి రైతులలో ఆత్మస్థైర్యం నింపాలని డిమాండ్ చేశారు.సిద్దిపేట సభలో 50కోట్లు ఖర్చుపెట్టి కేసీఆర్, హరీష్ ను తిట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నారని విమర్శించారు ప్రాజెక్టులను ఎండబెట్టి ఇసుక దందా చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో వాకిటి శ్రీధర్, నందిమల్లఅశోక్, మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ విజయ్ కుమార్, కె.మాణిక్యం, గంధం పరంజ్యోతి, రఘువర్ధన్ రెడ్డి, వేణు గోపాల్ నాయుడు, ధర్మా నాయక్, దేవర్ల నరసింహ, సునీల్ వాల్మీకి, జోహెబ్ హుస్సేన్, చిట్యాల రాము, సయ్యద్ జమీల్, మందరాము, బాబు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకాలపై కలెక్టర్ విచారణ జరిపించాలి

- అధికారుల మౌనం వెనుక మంత్రి అండేనా?
- బీరెల్లి స్వప్న
- కోటి రూపాయలు ఏమయ్యాయి? లెక్కలు చెప్పండి!
- లక్ష్మీదేవిపేటలో ఫోర్జరీ సంతకాల కలకలం
- 11 నెలలు, కోటి నిధులు, కాగితాల్లోనే అభివృద్ధి!
- స్పందించని అధికారులపై స్వప్న ఫైర్





ములుగు జిల్లా ప్రతినిధి, నవంబర్ 26 (పీపుల్స్ న్యూస్): వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేట గ్రామ పంచాయతీ కార్యాలయంపై గత పది రోజులుగా పత్రికల్లో వస్తున్న కథనాలపై అధికారులు ఎందుకు స్పందించడం లేదని బీఆర్ఎస్ ములుగు జిల్లా మహిళా నాయకురాలు బీరెల్లి స్వప్న ప్రశ్నించారు.గురువారం ఆమె మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామంలో ఆ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. లక్ష్మీదేవిపేట పంచాయతీ వ్యవహారంలో అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు చేశారు.
లక్ష్మీదేవిపేట పంచాయతీలో జరుగుతున్న అవకతవకలపై వరుసగా కథనాలు వస్తున్నా, సంబంధిత అధికారులు మౌనంగా ఉండటం వెనుక కారణం ఏమిటని నిలదీశారు. మంత్రి సీతక్క అండ ఉంటే అధికారులతో పని లేదా అని ప్రశ్నించారు. ఫోర్జరీ సంతకాలపై పంచాయతీ శాఖ అధికారులు స్పందించకపోవడం హాస్యాస్పదంగా ఉందని వ్యాఖ్యానించారు.సర్పంచ్ సంతకాలపై ఫోర్జరీ ఆరోపణలు వచ్చి, విచారణ జరపాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు.గడిచిన 11 నెలల్లో లక్ష్మీదేవిపేట గ్రామ పంచాయతీకి కోటి రూపాయల నిధులు వచ్చాయని గొప్పగా చెప్పుకుంటున్నారని, కానీ వాటిని కేవలం కాగితాల్లోనే చూపించి అభివృద్ధిలో గ్రామాన్ని వెనుకబడేలా చేశారని ఆరోపించారు. నిధులు వచ్చాయని చెప్పుకుంటున్న వారు, ఆ నిధులతో ఏయే పనులు చేశారు, ఎంత ఖర్చు చేశారు, మిగిలిన డబ్బు ఎక్కడ ఉందనే లెక్కలు ప్రజల ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. 11 నెలల పాలనపై కలెక్టర్ స్వయంగా విచారణ జరిపించాలని బీరెల్లి స్వప్న కోరారు. పంచాయతీ నిధులు, బిల్లులు, షాపుల కేటాయింపు, ఫోర్జరీ సంతకాల వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే ప్రజల్లో అధికారులపై నమ్మకం పూర్తిగా పోతుందని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అంతటి రాము, ముడిగే రాజ్ కుమార్, అజ్మీర రజిత, నీలం రవి, ఇంచర్ల వంశీ, ముఖ్య కార్యకర్తలు, మాజీ సర్పంచ్ గట్టు కుమారస్వామి, గుండ్ల రమేష్, నడిగోటు సుదర్శన్, తండ రమేష్, కొండం సంపత్ రెడ్డి, చిలుక కుమార్, అంతగిరి రాజయ్య, మూదం మల్లయ్య, భూక్య సీతారాం, ఎల్లవేణి కొమరయ్య, అజ్మీర దేవకుమార్, వేల్పుల రఘుపతి, వేశాల రమేష్, జేరిపోతుల కిరణ్, ఎర్ర రాములు, ఎనిమిల రఘు, అల్లం రాకేష్, బొడ్డుపల్లి స్వామి, పున్నం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 2-4 డిగ్రీలు తగ్గుతాయన్న భారత వాతావరణ కేంద్రం..!



ఆదిలాబాద్ : రాష్ట్రంలో మళ్లీ పొడి వాతావరణం ఏర్పడుతున్న నేపథ్యంలో రానున్న ఐదు రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గుతాయని హైదరాబాద్‌లోని భారత వాతావరణ కేంద్ర విభాగం వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా చలి తీవ్రత పెరిగే అవకాశం ఉందని తెలిపింది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఆకాశం మేఘావృతమై ఉండటం కారణంగా రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యాయి.అయితే డిసెంబర్ మూడు వరకు పొడి వాతావరణం కొనసాగుతుందని వాతావరణ కేంద్రం తన ఏడు రోజుల సూచనలో పేర్కొన్నది. దాంతో ఉష్ణోగ్రతలు మళ్లీ తగ్గుముఖం పట్టనున్నాయి. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సొసైటీ గణాంకాల ప్రకారం.. ఇప్పటికే ఉత్తర తెలంగాణ జిల్లాలతోపాటు హైదరాబాద్ నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు తగ్గుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈరోజు ఉదయం 8:30 గంటల సమయంలో కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ అర్బన్‌లో రాష్ట్రంలోనే అత్యల్పంగా 15 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.
ఆదిలాబాద్ జిల్లాలోని బేల, గడిగూడ వంటి ప్రాంతాల్లో 15.4 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. మరోవైపు మేఘాల ప్రభావంతో గ్రేటర్ హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సైబరాబాద్ పరిధిలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 19.9 నుంచి 21.3 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. రానున్న రోజుల్లో ఈ ప్రాంతాల్లో కూడా చలి ప్రభావం స్పష్టంగా కనిపించనుంది.

బాచుపల్లి సెప్టిక్ ట్యాంక్ విషాదంపై జాతీయ కమిషన్ సీరియస్

- మృతుల కుటుంబాలకు రూ.30 లక్షల పరిహారం.. సొంత ఇళ్లు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం!
- బాధ్యులైన ప్రైవేట్ కంపెనీ చైర్మన్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశం.. కార్మికుల హక్కుల కాలరాతపై ఆగ్రహం



మేడ్చల్-మల్కాజిగిరి, నవంబర్ 26 (పీపుల్స్ న్యూస్) :బాచుపల్లిలో సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేస్తూ ముగ్గురు పారిశుద్ధ్య కార్మికులు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ తీవ్రంగా స్పందించింది. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.30 లక్షల చొప్పున ఆర్థిక పరిహారం అందించడంతో పాటు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా సొంత ఇళ్లు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని సంబంధిత అధికారులను కమిషన్ సభ్యుడు కరం సింగ్ కర్మా ఆదేశించారు. ఈ దుర్ఘటనకు బాధ్యులైన ప్రైవేట్ కంపెనీ చైర్మన్ రవిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులకు సూచించారు.గురువారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం బాచుపల్లి పరిధిలోని దీపక్ హారిక్ రెసిడెన్షియల్ సొసైటీలో జరిగిన ప్రమాద స్థలాన్ని కరం సింగ్ కర్మా, డీసీపీ కోటిరెడ్డి, జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి సందర్శించారు. సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేస్తుండగా మాన్యువల్ స్కావెంజింగ్ కారణంగా షణ్ముఖరావు అలియాస్ సుమన్ (26), సురేష్ గజింగి (24), పవన్ (20) మృతి చెందిన ఘటనపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కమిషన్ సభ్యుడు మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానం ఇంతగా అభివృద్ధి చెందిన కాలంలోనూ కార్మికులను ఎలాంటి భద్రతా పరికరాలు, యంత్రాలు లేకుండా సెప్టిక్ ట్యాంకుల్లోకి దింపడం అత్యంత దారుణమన్నారు. తక్కువ ఖర్చు కోసం రిజిస్ట్రేషన్ లేని, సరైన శిక్షణ పొందని ప్రైవేట్ ఏజెన్సీలకు పనులు అప్పగించడం వల్లే ఇలాంటి ప్రాణనష్టాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కార్మికులతో ప్రమాదకర పనులు చేయించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు.
మృతుల కుటుంబాలకు కంపెనీ తరఫున తక్షణ పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని, చెక్కులు, బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయడం ద్వారా ఆర్థిక సహాయం అందించాలని ఆదేశించారు. శ్రీకాకుళం వెళ్లిన మృతుల వారసులకు పరిహారం అందజేస్తామని అధికారులు కమిషన్‌కు వివరించారు.





● కార్మికుల హక్కులు కాలరాస్తున్న కాంట్రాక్టర్లు

బాచుపల్లి పరిధిలోని రెసిడెన్షియల్ సొసైటీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులతో కమిషన్ సభ్యుడు నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కాంట్రాక్టర్లు కనీస వేతనాలు చెల్లించకపోవడంతో పాటు గత మూడేళ్లుగా బోనస్, యూనిఫామ్, బూట్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించడం లేదని, పీఎఫ్, ఈఎస్ఐ నిధులు కూడా చెల్లించకుండా కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు గుర్తించారు.
మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న డ్రెస్ అలవెన్సులు, బోనస్, పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలను తక్షణమే కార్మికులకు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించడంతోనే సొసైటీల అధ్యక్షులు, కార్యదర్శులు తమ బాధ్యతల నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు.
బాచుపల్లి పరిధిలోని సుమారు 255 రెసిడెన్షియల్ సొసైటీల అధ్యక్షులు, కార్యదర్శులతో ప్రతి ఆరు నెలలకు ఒకసారి సమావేశం ఏర్పాటు చేసి, కార్మికుల కనీస వేతనాలు, హక్కులు, సెప్టిక్ ట్యాంక్ శుభ్రత పనుల్లో పాటించాల్సిన భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. నిబంధనలు ఉల్లంఘించే కాంట్రాక్టర్లపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

● ప్రతి సొసైటీలో హెచ్చరిక బోర్డులు తప్పనిసరి



సెప్టిక్ ట్యాంకులు, సీవర్ పనుల కోసం పాటించాల్సిన ప్రామాణిక నిర్వహణ విధానాలు (ఎస్ఓపీ), వాటర్ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ) టోల్‌ఫ్రీ నంబర్లతో కూడిన హెచ్చరిక బోర్డులను ప్రతి రెసిడెన్షియల్ సొసైటీలో తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన మార్గదర్శకాలు అమలు చేయాలని స్పష్టం చేశారు.

● మృతుల కుటుంబాలకు భరోసా

అనంతరం సురేష్ గజింగి కుటుంబాన్ని కమిషన్ సభ్యుడు పరామర్శించారు. సురేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆర్థిక సహాయంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా సొంత ఇల్లు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం మృతుల కుటుంబాలకు చెక్కులు అందజేశారు.ఈ పర్యటనలో కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకెష్ కుమార్, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోజెస్, బాచుపల్లి డీసీ షబ్బీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను ప్రశ్నించినందుకు హోటల్ తొలగింపునకు యత్నం.. బాధితుడు ఆందోళన



మహబూబ్‌నగర్ : అబద్దపు ప్రచారాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పై అన్ని వర్గాల ప్రజలు మండిపడుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై నిలదీసినందుకు ఎజాజ్‌అనే వ్యక్తికి చెందిన హోటల్ తొలగింపునకు పాల్పడడం పట్ల సర్వత్ర విమర్శలు వ్యక్తమవు తున్నాయి .మహబూబ్‌నగర్ జిల్లా కావేరమ్మపేట గ్రామంలో ఎన్నికల ముందు ఈద్గాకు ఇస్తానన్న ఐదు లక్షల హామీ నెరవేర్చాలని గురువారం గ్రామానికి వచ్చిన కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డిని ఎజాజ్‌తో పాటు మరికొందరు మైనార్టీలు నిలదీశాడు. దీంతో అతడిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేస్తూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు.కొద్దిసేపటికే బస్టాండ్ వద్ద హోటల్ నడుపుతున్న ఎజాజ్ వద్దకు మున్సిపల్ అధికారులు వచ్చి హోటల్ తొలగింపునకు యత్నించారు. హోటల్ తొలగిస్తే ఆత్మహత్య చేసుకుంటా నని చెప్పడంతో అధికారులు అక్కడి నుంచి వెనుతిరిగి పోయారు. ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తే తన జీవనాధారంపై దెబ్బ కొడతారా అంటూ ఎజాజ్ ఆవేదన వ్యక్తం చేశాడు.

సంపాదకీయం

బడ్జెట్ రూపకల్పనలో యువత భాగస్వామ్యం

● జెన్ జెడ్ అభిప్రాయాలకు కేంద్రం ప్రాధాన్యం..

దేశ ఆర్థిక భవిష్యత్తుపై కొత్త ఆశలు



దేశ భవిష్యత్తును నిర్ణయించే ఆర్థిక విధానాల రూపకల్పనలో యువతకు చోటు కల్పించాలన్న కేంద్ర ప్రభుత్వ ఆలోచన స్వాగతించదగినది. ఇప్పటివరకు కేంద్ర బడ్జెట్ తయారీ ప్రక్రియలో ఆర్థిక నిపుణులు, పారిశ్రామికవేత్తలు, రైతు సంఘాలు, వివిధ రంగాల ప్రతినిధుల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు. అయితే దేశ జనాభాలో గణనీయమైన భాగంగా ఉన్న యువత ఆలోచనలు, ఆకాంక్షలకు కూడా విధాన రూపకల్పనలో స్థానం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ నేపథ్యంలో 2027-28 ఆర్థిక సంవత్సర బడ్జెట్ రూపకల్పనలో జెన్ జెడ్ యువతను భాగస్వాములను చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం ప్రాధాన్యత సంతరించుకుంది.సాధారణంగా బడ్జెట్ అంటే ఆదాయాలు, ఖర్చులు, పన్నులు, రాయితీలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల సమాహారంగా భావిస్తుంటాం. కానీ బడ్జెట్ అనేది కేవలం ప్రభుత్వ లెక్కల పుస్తకం మాత్రమే కాదు. దేశంలోని అన్ని వర్గాల ప్రజల జీవితాలను ప్రభావితం చేసే ఆర్థిక ప్రణాళిక. అందులోనూ భవిష్యత్తులో దేశ బాధ్యతలను చేపట్టబోయే యువతకు సంబంధించిన అంశాలు అత్యంత కీలకం. వారి అవసరాలు, సమస్యలు, ఆశయాలను పరిగణనలోకి తీసుకోకుండా రూపొందించే ఆర్థిక విధానాలు ఆశించిన ఫలితాలను ఇవ్వలేవు. అందుకే యువతను బడ్జెట్ సంప్రదింపుల్లో భాగస్వాములను చేయాలన్న నిర్ణయం మంచి పరిణామం.ప్రస్తుత యువత గత తరాలతో పోలిస్తే భిన్నమైన ఆలోచనా విధానాన్ని కలిగి ఉంది. సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, కృత్రిమ మేధస్సు, నూతన ఆవిష్కరణలు, స్వయం ఉపాధి వంటి రంగాలపై ఆసక్తి చూపుతోంది. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని కోరుకుంటోంది. అయితే వారి ఆశయాలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయా? ఉన్నత విద్యను అభ్యసించడానికి అవసరమైన ఆర్థిక వెసులుబాటు ఉందా? నైపుణ్యాలకు తగిన ఉద్యోగాలు లభిస్తున్నాయా? చిన్న వ్యాపారాలు, అంకుర సంస్థలు ప్రారంభించడానికి తగిన ప్రోత్సాహం లభిస్తోందా? అన్న ప్రశ్నలకు సమాధానాలు వెతకాల్సిన అవసరం ఉంది.దేశంలో నిరుద్యోగం యువతను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న సమస్యల్లో ఒకటి. ఏటా లక్షలాది మంది విద్యార్థులు పట్టాలు పొంది ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన యువత కొరత కూడా కనిపిస్తోంది. అంటే విద్యా వ్యవస్థకు, ఉపాధి రంగానికి మధ్య సమన్వయం అవసరమని స్పష్టమవుతోంది. బడ్జెట్‌లో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, వృత్తి విద్యకు తగిన నిధులు కేటాయించాలి. ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేటు రంగంలోనూ ఉపాధి అవకాశాలు పెరిగేలా విధానాలు రూపొందించాలి. యువతకు ఉద్యోగాలు కల్పించడమే కాకుండా ఉద్యోగాలు సృష్టించే స్థాయికి వారిని తీర్చిదిద్దాలి.ముఖ్యంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం యువతకు కొత్త అవకాశాలతో పాటు సవాళ్లను కూడా విసురుతోంది. కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యాసం, రోబోటిక్స్, డేటా సైన్స్ వంటి రంగాలు భవిష్యత్తు ఉపాధి స్వరూపాన్ని మార్చనున్నాయి. ఈ మార్పులకు అనుగుణంగా విద్యా విధానాలను రూపొందించడంతో పాటు యువతకు అవసరమైన శిక్షణ అందించాలి. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కూడా ఆధునిక సాంకేతిక విద్య అందుబాటులోకి రావాలి. పట్టణ, గ్రామీణ యువత మధ్య డిజిటల్ అంతరాన్ని తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.అలాగే యువతలో పారిశ్రామిక ఆలోచనలను ప్రోత్సహించడం కూడా కీలకం. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగం లేదా ప్రైవేటు ఉద్యోగం కోసమే ఎదురుచూడకుండా స్వయం ఉపాధి, చిన్న పరిశ్రమలు, అంకుర సంస్థల స్థాపన వైపు అడుగులు వేసేలా ప్రోత్సహించాలి. ఇందుకోసం తక్కువ వడ్డీ రుణాలు, సులభతర అనుమతులు, సాంకేతిక సహకారం, మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలి. ముఖ్యంగా మహిళా యువ పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, ఆహార శుద్ధి కేంద్రాలు, స్థానిక వనరుల ఆధారిత వ్యాపారాలకు అవకాశాలు కల్పిస్తే ఉపాధి కోసం వలసలు తగ్గే అవకాశం ఉంటుంది.యువతను బడ్జెట్ ప్రక్రియలో భాగస్వాములను చేయడానికి కేంద్రం చేపడుతున్న సంప్రదింపులు ఈ దిశగా తొలి అడుగుగా భావించవచ్చు. వివిధ రంగాలకు చెందిన 14 వర్గాల ప్రతినిధులతో బడ్జెట్ ముందస్తు చర్చలు జరపాలన్న నిర్ణయంలో యువతకు ప్రత్యేక స్థానం కల్పించడం గమనార్హం. అయితే ఈ సంప్రదింపులు కేవలం ఒక అధికారిక కార్యక్రమంగా మిగిలిపోకూడదు. దేశంలోని వివిధ ప్రాంతాలు, సామాజిక వర్గాలు, గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన యువతకు సమానంగా అభిప్రాయాలు వెల్లడించే అవకాశం కల్పించాలి. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాల యువత, విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు, అణగారిన వర్గాల ఆకాంక్షలకు ప్రాధాన్యం ఇవ్వాలి.యువత అభిప్రాయాలను సేకరించడం ఎంత ముఖ్యమో, వాటిని ఆచరణలో పెట్టడం అంతకంటే ముఖ్యం. బడ్జెట్ సమావేశాల్లో వారి సూచనలు వినడం, ఆ తర్వాత వాటిని పక్కన పెట్టడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. యువత సూచనల ఆధారంగా తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలు తీరును ప్రజలకు వెల్లడించాలి. బడ్జెట్‌లో యువత కోసం కేటాయించిన నిధులు నిజంగా వారికి చేరుతున్నాయా లేదా అన్నదానిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. కేవలం ఆకర్షణీయమైన ప్రకటనలతో యువత ఆశలు నెరవేరవు. వారికి నాణ్యమైన విద్య, ఉపాధి, ఆర్థిక భద్రత, సమాన అవకాశాలు కల్పించినప్పుడే అభివృద్ధిలో భాగస్వాములు చేయగలుగుతాం.ప్రపంచంలో అత్యధిక యువ జనాభా కలిగిన దేశాల్లో భారత్ ఒకటి. ఈ జనాభాను దేశానికి భారంగా కాకుండా బలంగా మార్చుకోవాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. యువత శక్తి, ఆలోచనలు, సృజనాత్మకతకు సరైన దిశానిర్దేశం లభిస్తే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమవుతుంది. అందుకే బడ్జెట్ రూపకల్పనలో యువతకు అవకాశం కల్పించాలన్న నిర్ణయం ఆహ్వానించదగినదే. అయితే ఈ ప్రయత్నం ఒక బడ్జెట్‌కే పరిమితం కాకుండా భవిష్యత్తులోనూ కొనసాగాలి. యువత గొంతుక విధాన నిర్ణయాల్లో ప్రతిధ్వనించాలి. వారి ఆశయాలు ప్రభుత్వ ప్రణాళికల్లో ప్రతిబింబించాలి. అప్పుడే యువ భారతం ఆర్థికంగా బలమైన భారతంగా ఎదుగుతుంది.

మహిళా శక్తితోనే సంపూర్ణ రాజ్యాంగ లక్ష్యం

చట్టసభల్లో మహిళలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలి.. సాధికారతకు మాటలు కాదు, ఆచరణాత్మక చర్యలు అవసరం



భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడే రాజ్యాంగం నిర్దేశించిన సమానత్వ లక్ష్యాలు సంపూర్ణంగా నెరవేరుతాయి. దేశ జనాభాలో దాదాపు సగం మంది మహిళలే అయినప్పటికీ రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో వారికి దక్కుతున్న ప్రాతినిధ్యం ఇంకా ఆశించిన స్థాయిలో లేదు. మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించాలని రాజ్యాంగం స్పష్టం చేస్తున్నా ఆచరణలో అనేక అడ్డంకులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ మహిళా శక్తి ప్రాధాన్యాన్ని ప్రస్తావించడం, రాజ్యాంగ నిర్మాణంలో మహిళల పాత్రను గుర్తుచేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.భారత రాజ్యాంగ రూపకల్పనలో మహిళల పాత్ర ఎంతో విశిష్టమైనది. రాజ్యాంగ పరిషత్‌లో సభ్యులుగా ఉన్న మహిళలు దేశ భవిష్యత్తుకు సంబంధించిన అనేక అంశాలపై తమ అభిప్రాయాలను బలంగా వినిపించారు. సరోజినీ నాయుడు, హంసా మెహతా, దుర్గాబాయి దేశ్‌ముఖ్ వంటి మహిళా ప్రముఖులు రాజ్యాంగ నిర్మాణంలో తమదైన ముద్ర వేశారు. మహిళలకు సమాన హక్కులు, సామాజిక న్యాయం, విద్య, స్వేచ్ఛ, గౌరవప్రదమైన జీవనం వంటి అంశాలకు వారు ప్రాధాన్యం ఇచ్చారు. అందువల్ల రాజ్యాంగ ప్రస్థానాన్ని ప్రస్తావించేటప్పుడు మహిళల సేవలను విస్మరించడం సాధ్యం కాదు.అయితే రాజ్యాంగం అమలులోకి వచ్చి ఏడు దశాబ్దాలకు పైగా గడిచినా మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు పూర్తిస్థాయిలో అందడం లేదు. విద్య, వైద్యం, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం వంటి రంగాల్లో పురోగతి కనిపిస్తున్నప్పటికీ ఇంకా అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. బాల్యవివాహాలు, వరకట్న వేధింపులు, మహిళలపై హింస, లైంగిక దాడులు, ఆర్థిక అసమానతలు మహిళల అభివృద్ధికి ఆటంకాలుగా మారుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఇప్పటికీ కుటుంబ బాధ్యతలకే పరిమితమవుతున్న పరిస్థితులు ఉన్నాయి. విద్యావంతులైన మహిళలు సైతం ఉద్యోగ అవకాశాలు, వేతనాల్లో వివక్షను ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో మహిళా సాధికారతను కేవలం నినాదంగా కాకుండా సమాజ మార్పుకు పునాదిగా చూడాలి.మహిళలకు రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించడం ప్రజాస్వామ్య బలోపేతానికి అత్యంత అవసరం. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలన్న డిమాండ్ ఎన్నో ఏళ్లుగా కొనసాగుతోంది. ఈ దిశగా 2023లో పార్లమెంట్ ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టం కీలక ముందడుగు. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం స్థానాలు కేటాయించే లక్ష్యంతో ఈ చట్టాన్ని తీసుకొచ్చారు. అయితే జనగణన, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియతో ముడిపడి ఉండటంతో అమలుపై ఇంకా అనేక ప్రశ్నలు ఉన్నాయి. మహిళలకు ప్రాతినిధ్యం కల్పించే లక్ష్యం ఎంత త్వరగా కార్యరూపం దాలుస్తుందన్నదే ఇప్పుడు కీలకం.మహిళా రిజర్వేషన్ల అంశంపై రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయం అవసరం. మహిళలకు ప్రాతినిధ్యం కల్పించడం ఏ ఒక్క పార్టీకి సంబంధించిన అంశం కాదు. ఇది దేశ ప్రజాస్వామ్యానికి సంబంధించిన విషయం. అధికార, ప్రతిపక్ష పార్టీలు రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి మహిళల హక్కుల కోసం కలిసి పనిచేయాలి. మహిళా రిజర్వేషన్ బిల్లుపై రాజకీయ విమర్శలు, పరస్పర ఆరోపణలకే పరిమితం కాకుండా అమలుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. చట్టసభల్లో మహిళల సంఖ్య పెరగడంతోపాటు నిర్ణయాత్మక స్థానాల్లోనూ వారికి అవకాశం కల్పించాలి. మహిళలు కేవలం ప్రతినిధులుగా కాకుండా విధాన రూపకర్తలుగా ఎదిగే వాతావరణం కల్పించాలి.మహిళా సాధికారతకు రాజకీయ ప్రాతినిధ్యంతోపాటు ఆర్థిక స్వావలంబన కూడా ఎంతో ముఖ్యం. కుటుంబ ఆదాయంలో మహిళల పాత్ర పెరిగినప్పుడే వారికి సమాజంలో గౌరవం, స్వతంత్ర నిర్ణయాధికారం లభిస్తాయి. స్వయం సహాయక సంఘాల ద్వారా లక్షలాది మంది మహిళలు ఆర్థిక కార్యకలాపాల్లో భాగస్వాములవుతున్నారు. చిన్న వ్యాపారాలు, కుటీర పరిశ్రమలు, వ్యవసాయ అనుబంధ రంగాల్లో మహిళలకు మరిన్ని అవకాశాలు కల్పించాలి. బ్యాంకు రుణాలు, మార్కెటింగ్ సదుపాయాలు, నైపుణ్య శిక్షణ అందించాలి. మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెట్ కల్పించి వారి ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలి. ఉద్యోగినులకు సురక్షితమైన పని ప్రదేశాలు, సమాన వేతనాలు, ప్రసూతి ప్రయోజనాలు అందేలా ప్రభుత్వాలు పర్యవేక్షించాలి.మహిళల భద్రత కూడా సాధికారతలో కీలకమైన అంశం. ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ సురక్షితంగా తిరిగి వస్తుందన్న నమ్మకం సమాజంలో ఉండాలి. మహిళలపై నేరాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే వాటిని నివారించే వ్యవస్థను బలోపేతం చేయాలి. పోలీసు వ్యవస్థలో మహిళలకు అనుకూలమైన సేవలు, వేగవంతమైన విచారణ, బాధితులకు న్యాయ సహాయం అందుబాటులో ఉండాలి. పాఠశాల స్థాయి నుంచే బాలబాలికలకు సమానత్వం, పరస్పర గౌరవం, మహిళల హక్కులపై అవగాహన కల్పించాలి. మహిళలను గౌరవించే సంస్కారం కుటుంబం నుంచే ప్రారంభం కావాలి.మరోవైపు గ్రామీణ, గిరిజన ప్రాంతాల మహిళల సమస్యలపై ప్రత్యేక దృష్టి అవసరం. అక్కడి మహిళలు విద్య, వైద్యం, రవాణా, ఉపాధి అవకాశాల కొరతతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి. బాలికల చదువు మధ్యలో ఆగిపోకుండా ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించాలి. ఉన్నత విద్య, సాంకేతిక విద్యలో మహిళల ప్రవేశాన్ని పెంచాలి. మహిళా రైతులకు భూమిపై హక్కులు, వ్యవసాయ రుణాలు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలి. మహిళల అవసరాలను గుర్తించి రూపొందించే అభివృద్ధి ప్రణాళికలే సమాజానికి నిజమైన మేలు చేస్తాయి.ప్రధాని మోదీ మహిళా శక్తి ప్రాధాన్యాన్ని ప్రస్తావిస్తూ మహిళలకు న్యాయం జరిగేలా తమ ప్రభుత్వం కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. అయితే మహిళా సాధికారతకు సంబంధించి ప్రభుత్వాలు చేసే ప్రకటనలు క్షేత్రస్థాయిలో ఫలితాలు ఇవ్వాలి. మహిళల పేరుతో పథకాలు ప్రకటించడం మాత్రమే కాకుండా వాటి ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరాలి. మహిళలపై నేరాలు తగ్గాలి. బాలికల విద్యాభ్యాసం పెరగాలి. ఉపాధి అవకాశాలు విస్తరించాలి. రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలి. అప్పుడే మహిళా సాధికారతకు నిజమైన అర్థం లభిస్తుంది.రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించింది. ఆ హక్కులు మహిళలకు పూర్తిస్థాయిలో అందినప్పుడే రాజ్యాంగ నిర్మాతల ఆశయాలు నెరవేరుతాయి. మహిళల అభివృద్ధి అంటే ఒక వర్గం అభివృద్ధి మాత్రమే కాదు.. కుటుంబం, సమాజం, దేశ అభివృద్ధికి పునాది. మహిళలకు సమాన అవకాశాలు కల్పించిన దేశమే సమగ్ర అభివృద్ధి సాధించగలదు. అందుకే మహిళా శక్తిని గుర్తించడం, గౌరవించడం, నిర్ణయాధికారంలో భాగస్వాములను చేయడం పాలకుల బాధ్యత. మహిళలకు హక్కులు కల్పించడం ద్వారా మాత్రమే కాకుండా ఆ హక్కులను వినియోగించుకునే స్వేచ్ఛ, భద్రత, ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించినప్పుడే రాజ్యాంగం సంపూర్ణతను సంతరించుకుంటుంది.

వాతావరణ పరిరక్షణకు ప్రపంచ దేశాల సమష్టి బాధ్యత

సమ్మతి లేకుండానే ముగిసిన కాప్31.. శిలాజ ఇంధనాలు, ఆర్థిక సాయం అంశాలపై వీడని విభేదాలు



వాతావరణ మార్పులు యావత్ మానవాళికి పెను సవాలుగా మారుతున్న తరుణంలో ప్రపంచ దేశాల మధ్య సమన్వయం, సహకారం అత్యంత అవసరం. భూతాపం పెరుగుదల, ప్రకృతి వైపరీత్యాలు, కరువులు, వరదలు, తుపానులు ఇప్పటికే అనేక దేశాలను అతలాకుతలం చేస్తున్నాయి. అయినప్పటికీ ఈ ముప్పును ఎదుర్కోవడంలో ప్రపంచ దేశాలు ఏకాభిప్రాయానికి రాలేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. టర్కీలోని అంటాల్యాలో జరిగిన ఐక్యరాజ్యసమితి 31వ వాతావరణ సదస్సు (కాప్31) కీలక అంశాలపై ఒప్పందం కుదరకుండానే ముగియడం అంతర్జాతీయ వాతావరణ దౌత్యంలో నెలకొన్న ప్రతిష్టంభనకు నిదర్శనం.దాదాపు 200 దేశాలు పాల్గొన్న ఈ సదస్సులో వాతావరణ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు అనేక అంశాలపై చర్చలు జరిగాయి. అయితే శిలాజ ఇంధనాల వినియోగాన్ని దశలవారీగా తగ్గించడం, అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఆర్థిక సహాయం అందించడం వంటి కీలక అంశాల్లో ఏకాభిప్రాయం కుదరలేదు. చర్చలు నిర్ణీత గడువును దాటి కొనసాగినా ఫలితం లేకపోవడం విచారకరం. ముఖ్యంగా బొగ్గు, చమురు, సహజ వాయువు వినియోగంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోలేకపోవడం సదస్సు వైఖల్యాన్ని మరింత స్పష్టం చేసింది.ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు ప్రధాన కారణం శిలాజ ఇంధనాల వినియోగమేనని శాస్త్రవేత్తలు పదేపదే హెచ్చరిస్తున్నారు. బొగ్గు, పెట్రోలియం, సహజ వాయువుల వినియోగం వల్ల వాతావరణంలోకి భారీగా కర్బన ఉద్గారాలు విడుదలవుతున్నాయి. వీటిని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగాన్ని పెంచాలని గతంలో జరిగిన అంతర్జాతీయ సదస్సుల్లో నిర్ణయించారు. 2023లో దుబాయ్‌లో జరిగిన కాప్28లోనూ శిలాజ ఇంధనాల నుంచి క్రమంగా దూరం కావాలని అంగీకరించారు. కానీ ఆ నిర్ణయాలను అమలు చేసే విషయంలో దేశాల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చమురు ఉత్పత్తి చేసే దేశాలు తమ ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కఠినమైన నిర్ణయాలను వ్యతిరేకిస్తుండగా, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిచ్చే దేశాలు ఉద్గారాల తగ్గింపుపై స్పష్టమైన హామీలు కోరుతున్నాయి.మరోవైపు అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య ఆర్థిక బాధ్యతల విషయంలోనూ తీవ్ర విభేదాలు నెలకొన్నాయి.

ఒక్కరే కారులో వెళ్తే జరిమానా వేస్తారా.. కార్ పూలింగ్‌పై పోలీసుల క్లారిటీ!



కారులో ఒక్కరే ప్రయాణిస్తే జరిమానా విధిస్తారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని తెలంగాణ పోలీసులు ఖండించారు. అలాంటి నిబంధనలు గానీ, ప్రతిపాదనలు లేవని స్పష్టం చేశారు. అయితే ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఒకే రూట్‌లో వెళ్లేవారు కార్ పూలింగ్ చేసుకోవాలని సైబరాబాద్ సీపీ రమేష్ సూచించారు. ఐదుగురు ఒకే కారులో, ఇద్దరు ఒకే బైక్‌పై వెళ్లాలని, వీలుకాని వారు ప్రజా రవాణాను వినియోగించుకోవాలని కోరారు.హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు కార్ పూలింగ్‌ను ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో సోషల్ మీడియాలో ఓ అసత్య ప్రచారం వైరల్ అవుతోంది. కారులో ఒక్కరే ప్రయాణిస్తే పోలీసులు జరిమానా విధిస్తారంటూ వస్తున్న వార్తలపై తెలంగాణ పోలీసులు స్పష్టత ఇచ్చారు. ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని తేల్చి చెప్పారు. కారులో ఒంటరిగా ప్రయాణించినందుకు ఫైన్ వేసేలా ఎలాంటి ట్రాఫిక్ నిబంధనలు తీసుకురావడం లేదని స్పష్టం చేశారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రజలు కార్ పూలింగ్, ప్రజా రవాణాను వినియోగించుకోవాలని మాత్రమే సూచించినట్లు వివరించారు. కారులో ఒక్కరే ప్రయాణించే వారిపై జరిమానా విధించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆలోచిస్తోందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని తెలంగాణ ప్రభుత్వ ఫ్యాక్ట్‌చెక్ విభాగం ఖండించింది.ఈ క్రమంలోనే పోలీసుల వివరణను ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. కార్ పూలింగ్ అనేది కేవలం ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు చేస్తున్న విజ్ఞప్తి మాత్రమేనని తెలిపింది. ఒకే మార్గంలో వెళ్లేవారు తమ ప్రయాణాన్ని ఇతరులతో పంచుకోవడం ద్వారా రోడ్లపై వాహనాల సంఖ్యను తగ్గించవచ్చని పోలీసులు సూచించారు. దీనికి జరిమానాలు, శిక్షలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కారులో ఒంటరిగా ప్రయాణించినందుకు ఫైన్ విధించే ప్రతిపాదన కూడా లేదని తేల్చి చెప్పారు.'చంద్రబాబు, జగన్ చొక్కాలు పట్టుకుని ఎప్పుడైనా కొట్టుకున్నారా.. మరి మీకు అవసరమా?': హైపర్ ఆదియలహంక గురించి మా ఇద్దరికి అంతా తెలుసు.. వైసీపీలో ఉన్నప్పుడు ఆ మాటకు ఎంతో ఫీలయ్యా:

విజయసాయిరెడ్డిసన్ టీవీ ఉద్యోగులకు గోల్డ్ రింగ్స్, అదిరిపోయే భోజనం.. మనసు గెలుచుకున్న కావ్య మారన్-అనిరుధ్ డిసెంబర్ మాసంలో మేషం సహా ఏ రాశుల వారికి అదృష్టం కలిసిరానుంది?మరోవైపు.. సైబరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు కార్ పూలింగ్‌ను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ చైర్మన్ ఎం. రమేష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఒకే వాహనంలో ఒక్కరే ప్రయాణించే పద్ధతిని తగ్గించాలని సూచించారు. ఒకే రూట్‌లో వెళ్లే ఐదుగురు ఒకే కారులో, ఇద్దరు ఒకే బైక్‌పై వెళ్లేలా ప్రణాళిక చేసుకోవాలని కోరారు. ఇలా చేయడం ద్వారా రోడ్లపై వాహనాల సంఖ్య తగ్గి ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు సహకరించినవారవుతారని తెలిపారు. కార్ పూలింగ్ సాధ్యం కానివారు ప్రజా రవాణాను వినియోగించుకోవాలని సైబరాబాద్ సీపీ రమేష్ సూచించారు. సైబరాబాద్‌లో నివసించే వారు, ఇక్కడ ఉద్యోగాలు చేసేవారు, ఇతర ప్రాంతాల నుంచి నిత్యం రాకపోకలు సాగించేవారు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పిల్లలను స్కూళ్లకు తీసుకెళ్లే.. తిరిగి తీసుకొచ్చే తల్లిదండ్రులు కూడా వీలైనంతవరకు ప్రయాణాలను సమన్వయం చేసుకోవాలని కోరారు.సైబరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు సైకిళ్లపై ప్రయాణించే వారికి ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేయడంతోపాటు సురక్షితమైన, ఆటంకాలు లేని ప్రయాణానికి చర్యలు తీసుకుంటామని సీపీ రమేష్ తెలిపారు. పోలీసుల వద్ద ఉన్న సమాచారం, సీసీటీవీ కెమెరాల వివరాలు, వాహనాల రాకపోకల లెక్కల ఆధారంగా వివిధ రహదారుల్లో ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలిస్తామని చెప్పారు. గతంలో ఉన్న రద్దీతో పోలిస్తే కార్ పూలింగ్ అమలు తర్వాత వచ్చే మార్పులను కూడా ప్రజలకు చూపిస్తామని వివరించారు.జేఎన్‌టీయూ నుంచి ఐకియా వైపు ఐటీ కారిడార్‌లోకి గంట నుంచి గంటన్నర వ్యవధిలోనే సుమారు 65 శాతం మంది ఉద్యోగులు వస్తున్నారని సీపీ రమేష్ పేర్కొన్నారు. దీంతో ఆ సమయంలో రహదారులపై తీవ్ర రద్దీ ఏర్పడుతోందని వివరించారు. ఆర్టీసీ సహకారంతో రద్దీ సమయాల్లో అదనపు బస్సులు నడిపి ప్రజా రవాణాను ప్రోత్సహించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.
కార్ పూలింగ్‌ను ప్రోత్సహించేందుకు గత నెల రోజులుగా రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, ఐటీ కంపెనీలు, ఆసుపత్రులు, ఇతర భాగస్వామ్య వర్గాలతో చర్చలు జరిపినట్లు సీపీ రమేష్ వెల్లడించారు.

సైబరాబాద్ ట్రాఫిక్‌కు కొత్త దిశ.. వ్యక్తిగత వాహనాలకు కళ్లెం!

- 2027 నాటికి ఉద్యోగుల వ్యక్తిగత వాహనాల వినియోగం 10 శాతం తగ్గించడమే లక్ష్యం
- ప్రజా రవాణా, కార్‌పూలింగ్‌కు పెద్దపీట.. 15కు పైగా కార్పొరేట్ సంస్థల ప్రతిజ్ఞ
- ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత పరిష్కారంపై మూడు రోజుల మేధోమథనం.. 200 మందికి పైగా ప్రతినిధుల భాగస్వామ్యం
- డేటా ఆధారిత ప్రణాళికలతో రవాణా వ్యవస్థలో మార్పులు.. పాఠశాలల మార్గాలు, కూడళ్ల భద్రతకు ప్రత్యేక కార్యాచరణ











హైదరాబాద్: క్రైమ్ బ్యూరో నవంబర్ 26 (పీపుల్స్ న్యూస్) : వాహనాల రద్దీతో ఉక్కిరిబిక్కిరవుతున్న సైబరాబాద్ ప్రాంతానికి ట్రాఫిక్ సమస్యల నుంచి విముక్తి కల్పించేందుకు ప్రభుత్వం, పోలీసు శాఖ, కార్పొరేట్ సంస్థలు సమష్టి కార్యాచరణకు శ్రీకారం చుట్టాయి. వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించి ప్రజా రవాణాను ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యంగా 'సైబరాబాద్ మూవ్స్--2026' కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాదాపూర్‌లోని టీ-హబ్‌లో మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో 200 మందికి పైగా వివిధ రంగాల ప్రతినిధులు పాల్గొంటున్నారు.తెలంగాణ ప్రభుత్వం, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, సైబరాబాద్ పోలీసు శాఖ, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్సీ), షిఫ్ట్ ట్రాన్స్‌పోర్ట్ సంస్థలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ట్రాఫిక్ రద్దీకి కారణాలు, ప్రజా రవాణా లోపాలు, కార్యాలయాలకు ఉద్యోగుల రాకపోకలు, రోడ్ల అనుసంధానం వంటి అంశాలపై సమగ్రంగా చర్చించి భవిష్యత్ ప్రణాళికలు రూపొందించనున్నారు.

● 9 లక్షల మంది ఉద్యోగులతో రవాణా సవాలు

సైబరాబాద్ పోలీసు కమిషనర్, ఎస్‌సీఎస్సీ చైర్మన్ డాక్టర్ ఎం. రమేశ్ మాట్లాడుతూ.. కేవలం రెండు చదరపు కిలోమీటర్ల పరిధిలోనే సుమారు 9 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. ఇంత భారీ సంఖ్యలో ఉద్యోగుల రాకపోకలను సమర్థంగా నిర్వహించడం పెద్ద సవాలుగా మారిందన్నారు. ఈ కార్యక్రమానికి 113 భాగస్వామ్య సంస్థలు, 1,000 మందికి పైగా నమోదు చేసుకోవడం రవాణా సమస్యలపై ఉన్న ఆసక్తిని తెలియజేస్తోందన్నారు.

● వ్యక్తిగత వాహనాలపై ఆధారపడటమే ప్రధాన సమస్య

కార్యక్రమాన్ని ప్రారంభించిన డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. ప్రస్తుతం కేవలం 2 శాతం మంది మాత్రమే ప్రజా రవాణాను వినియోగిస్తుండగా, దాదాపు 82 శాతం మంది వ్యక్తిగత వాహనాలపై ఆధారపడుతున్నారని తెలిపారు. కార్యాలయాలు, నివాస ప్రాంతాలకు ప్రజా రవాణా పూర్తిస్థాయిలో అనుసంధానం కాక పోవడం కూడా ఈ పరిస్థితికి కారణమన్నారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, ప్రజల భాగస్వామ్యం అవసరమని స్పష్టం చేశారు.

● కార్పొరేట్ సంస్థల కీలక ప్రతిజ్ఞ

సైబరాబాద్ మూవ్స్ తొలిరోజు కార్యక్రమంలో 15కు పైగా కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు డీజీపీ సీవీ ఆనంద్ ఆధ్వర్యంలో కీలక ప్రతిజ్ఞ చేశారు. 2027 నాటికి ఉద్యోగుల రాకపోకలకు వినియోగించే వ్యక్తిగత వాహనాల సంఖ్యను 10 శాతం తగ్గించాలని నిర్ణయించారు. ఇందుకోసం కార్‌పూలింగ్, ప్రత్యేక బస్సులు, ప్రజా రవాణా, ఇంటి నుంచి పనిచేసే విధానం, చివరి మైలు అనుసంధానంపై దృష్టి సారించనున్నారు. 'నో సోలో.. సాథ్ చలో' నినాదంతో కార్‌పూలింగ్‌పై అవగాహన కల్పిస్తున్నారు.

● ట్రాఫిక్ సమస్యలకు ప్రయోగాత్మక పరిష్కారాలు

ఎస్‌సీఎస్సీ, డబ్ల్యూఆర్ఐ ఇండియా మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా సైబరాబాద్ మూవ్స్ లివింగ్ ల్యాబ్ ఏర్పాటు చేయనున్నారు. ట్రాఫిక్, రోడ్డు భద్రత సమస్యలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి పరిష్కారాలను ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. విజయవంతమైన విధానాలను ఇతర ప్రాంతాలకు విస్తరించేలా ప్రణాళికలు రూపొందించనున్నారు.

● పాఠశాలలు, కూడళ్ల భద్రతకు ప్రాధాన్యం

ఎస్‌సీఎస్సీ 20 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని పాఠశాలలకు వెళ్లే మార్గాల్లో భద్రత పెంపు, రద్దీ కూడళ్లను సురక్షితంగా తీర్చిదిద్దేందుకు రెండు మార్గదర్శకాలను విడుదల చేశారు. పాదచారులు, విద్యార్థులు, సైక్లిస్టులు, వాహనదారుల భద్రతకు అవసరమైన సూచనలు అందులో పొందుపరిచారు.

● ప్రజల అవసరాలకు అనుగుణంగా రవాణా ప్రణాళికలు

కొలంబియాలోని బొగోటా నగర మాజీ మేయర్ ఎన్రిక్ పెనలోసా మాట్లాడుతూ.. కారులో ప్రయాణించే వారికి ఉన్న రహదారి హక్కులు సైకిల్‌పై వెళ్లేవారికీ ఉండాలని పేర్కొన్నారు. పాదచారులకు నాణ్యమైన ఫుట్‌పాత్‌లు, సమర్థమైన ప్రజా రవాణా అవసరమన్నారు. లండన్ ట్రాన్స్‌పోర్ట్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ శశి వర్మ మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజా రవాణా, నడక మార్గాలు, రహదారి అనుసంధానాన్ని మెరుగుపరచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీజీపీ సీవీ ఆనంద్, అమెరికా కాన్సులేట్ ప్రతినిధి లారా విలియమ్స్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరకపూడి గాంధీ, హైదరాబాద్ పోలీసు కమిషనర్ డాక్టర్ ఎం. రమేశ్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ సృజన, బొగోటా మాజీ మేయర్ ఎన్రిక్ పెనలోసా, లండన్ ట్రాన్స్‌పోర్ట్ ప్రతినిధి శశి వర్మ, ఎస్-సీఎస్సీ ప్రతినిధి రమేశ్ కాజా, ఆర్టీసీ, మెట్రో, ఎంఎంటీఎస్, పోలీసు శాఖల అధికారులు, వివిధ కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



సరికొత్త హంగులతో సున్నం చెరువు.. పార్కులు, వాకింగ్ ట్రాక్, వ్యూ పాయింట్.. ప్రారంభానికి సిద్ధం

హైదరాబాద్ : నగరవాసులకు తీపి కబురు. మరో చెరువు ప్రారంభానికి సిద్ధమైంది. చెరువుల పరిరక్షణ కోసం ఏర్పాటైన హైడ్రా సున్నం చెరువును 14 ఎకరాల నుంచి 32 ఎకరాలకు విస్తరించి పునరుద్ధరించింది. నీటి నిల్వ సామర్థ్యాన్ని 47.58 మిలియన్ లీటర్ల నుంచి 200 మిలియన్ లీటర్లకు పెంచింది. 1.35 కిలోమీటర్ల వాకింగ్ ట్రాక్, పార్కులు, ఓపెన్ జిమ్, వ్యూ పాయింట్ ఏర్పాటు చేసింది. డిసెంబర్ 2, 3 తేదీల్లో సీఎం రేవంత్ రెడ్డి ఈ చెరువును ప్రారంభించనున్నారు.
ఆక్రమణలు, కాలుష్యంతో కుంచించుకుపోయి మురికికూపంగా మారిన హైదరాబాద్ సున్నం చెరువును ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేసింది హైడ్రా. డిసెంబర్ 2, 3 తేదీల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ చెరువును ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం రాత్రి క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్, పాత్‌వే, బండ్, ప్రవేశ ద్వారాలను తనిఖీ చేశారు. పెద్ద బండరాయిపై ఏర్పాటు చేసిన వ్యూ పాయింట్‌తోపాటు పార్కులు, చిన్నారుల ఆటస్థలాలు, ఓపెన్ జిమ్‌ను పరిశీలించి అధికారులకు కీలక సూచనలు చేశారు.
14 ఎకరాల నుంచి 32 ఎకరాలకు..ఒకప్పుడు ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలతో సున్నం చెరువు కేవలం 14 ఎకరాలకు కుచించుకుపోయింది. మురుగునీరు, చెత్తాచెదారం పేరుకుపోవడంతో పరిసర ప్రాంతాల ప్రజలు భరించలేని దుర్గంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చెరువు నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోవడంతో వర్షాకాలంలో సమీప కాలనీలకు ముంపు ప్రమాదం ఏర్పడేది. ఈ ఇబ్బందులను తప్పించేందుకు హైడ్రా ఎఫ్‌టీఎల్ పరిధిలోని ఆక్రమణలను తొలగించింది. ఈ క్రమంలో స్థానికుల నుంచి నిరసనలు, ఆందోళనలు ఎదురైనా పునరుద్ధరణ పనుల విషయంలో వెనక్కి తగ్గలేదు. ఫలితంగా చెరువు విస్తీర్ణం 14 ఎకరాల నుంచి 32 ఎకరాలకు



పెరిగింది. నీరు నిల్వ ఉండే ప్రాంతం 9 ఎకరాల నుంచి 16 ఎకరాలకు పైగా విస్తరించింది. చెరువులో గతంలో 47.58 మిలియన్ లీటర్ల నీటిని మాత్రమే నిల్వ చేసుకునే సామర్థ్యం ఉండగా.. ప్రస్తుతం అది 200 మిలియన్ లీటర్లకు చేరింది.
వరద ముప్పునకు చెక్..సున్నం చెరువు పునరుద్ధరణలో భాగంగా ఇన్‌లెట్లు, ఔట్‌లెట్లను సరిచేసి అభివృద్ధి చేశారు. దీంతో వర్షపు నీరు చెరువులోకి సక్రమంగా చేరడంతోపాటు అదనపు నీరు బయటకు వెళ్లేందుకు మార్గం ఏర్పడింది. చెరువు పునరుద్ధరణతో గుట్టలబేగంపేట, నవభారత్‌నగర్ తదితర ప్రాంతాలకు వరద ముప్పు తగ్గనుంది. చెరువులో నీటి నిల్వ పెరగడం వల్ల భూగర్భజలాల రీఛార్జికి కూడా అవకాశం ఏర్పడనుంది. చెరువు చుట్టూ 1.35 కిలోమీటర్ల పొడవున వాకింగ్ ట్రాక్ నిర్మించారు. స్థానికులు వ్యాయామం చేసుకునేలా ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. చిన్నారుల కోసం ఆటస్థలాలు, సందర్శకులు సేదతీరేందుకు పార్కులు అభివృద్ధి చేశారు. చెరువు పక్కనే ఉన్న పెద్ద బండరాయిపై ఏర్పాటు చేసిన వ్యూ పాయింట్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. దీంతో స్థానికులకు ఉదయం, సాయంత్రం వేళల్లో ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులోకి రానుంది.
20 చెరువుల పునరుద్ధరణకు హైడ్రా చర్యలుహైదరాబాద్‌లో ఒకప్పుడు గొలుసుకట్టు చెరువులు ప్రత్యేక గుర్తింపుగా ఉండేవి. పట్టణీకరణ, ఆక్రమణలు, ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా అవి క్రమంగా కనుమరుగయ్యాయి. ఈ పరిస్థితిని మార్చేందుకు హైడ్రా తొలిదశలో పలు చెరువుల పునరుద్ధరణకు నడుం బిగించింది.

భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ చదవాలి

- రాజ్యాంగ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత.. విద్యార్థులు, యువత ముందుండాలి
- కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు రాజ్యాంగ పీఠిక పఠనం





కూకట్‌పల్లి, నవంబర్ 26: (పీపుల్స్ న్యూస్) :భారత రాజ్యాంగాన్ని దేశంలోని ప్రతి పౌరుడు తప్పనిసరిగా చదివి, అందులో పొందుపరిచిన హక్కులు, బాధ్యతలు, ప్రజాస్వామ్య విలువలపై సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలని విముక్త చిరుతల కచ్చి (వీసీకే) తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామ్, విప్లవ విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యూ) రాష్ట్ర కార్యదర్శి నగేష్ సతీష్ కుమార్ పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి కర్తవ్యమని వారు స్పష్టం చేశారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబర్ 26న కూకట్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విప్లవ విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న శ్యామ్, నగేష్ సతీష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన కల్పించడం నేటి సమాజంలో ఎంతో అవసరమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సౌభ్రాతృత్వం వంటి అమూల్యమైన విలువలను అందించిందని తెలిపారు. కుల, మత, ప్రాంత, భాషా భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పిస్తూ దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు రాజ్యాంగం బలమైన పునాదిగా నిలిచిందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు రాజ్యాంగాన్ని కేవలం పాఠ్యాంశంగా కాకుండా, జీవితంలో ఆచరించాల్సిన మార్గదర్శకంగా భావించాలని సూచించారు.దేశంలో కొంత మంది మతోన్మాద శక్తులు రాజ్యాంగాన్ని మార్చుతామంటూ చేస్తున్న ప్రకటనలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వారు విమర్శించారు. ప్రజల ఆకాంక్షలు, ఎన్నో పోరాటాల ఫలితంగా రూపుదిద్దుకున్న భారత రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాజ్యాంగ విలువలకు విఘాతం కలిగించే ప్రయత్నాలను ప్రజాస్వామ్య వాదులంతా ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.దేశ భవిష్యత్తును నిర్మించే విద్యార్థులు, యువత రాజ్యాంగ పరిరక్షణ



రాజ్యాంగ పీఠిక చదువుతున్న నాయకులు విద్యార్థులు..

ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించాలని, ప్రజలకు తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించాలని కోరారు. ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమానత్వం బలోపేతం కావాలంటే రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ గౌరవించి ఆచరించాలని పేర్కొన్నారు.అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, విద్యార్థులు భారత రాజ్యాంగ పీఠికను సామూహికంగా పఠించి రాజ్యాంగ పరిరక్షణకు తమ నిబద్ధతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ నాయకులు చాకలి రాజు, విష్ణు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో నాలుగోసారి ఛాంపియన్‌షిప్ లక్ష్యంగా తెలంగాణ పోలీస్!

- వరుసగా మూడేళ్లు జాతీయస్థాయి విజేతగా తెలంగాణ పోలీస్.. మరోసారి ట్రైటిల్ కైవసం చేసుకోవడమే లక్ష్యం
- రాష్ట్రస్థాయి డ్యూటీ మీట్‌లో సైబరాబాద్ కమిషనరేట్ ఓవరాల్ ఛాంపియన్
- పోలీసుల వృత్తి నైపుణ్యాలకు డ్యూటీ మీట్ వేదిక.. విజేతలకు ఇంక్రిమెంట్లు, అవార్డులు అందించే అంశాన్ని పరిశీలిస్తాం: డీజీపీ సీవీ ఆనంద్





ఆల్ ఇండియా పోలీస్ బ్రాస్ బ్యాండ్ పోటీల్లో తెలంగాణ పోలీసు రెండో స్థానం సాధించడం గర్వకారణమని డీజీపీ పేర్కొన్నారు. తక్కువ సంఖ్యలో సిబ్బంది పాల్గొన్నప్పటికీ రజత పతకం సాధించడం అభినందనీయమన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఐదో తెలంగాణ పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌ను క్లస్టర్ల వారీగా నిర్వహించడం ద్వారా క్రీడాకారులకు మరిన్ని అవకాశాలు కల్పిస్తున్నట్లు వివరించారు.



హైదరాబాద్, క్రైమ్ బ్యూరో నవంబర్ 26 (పీపుల్స్ న్యూస్) :ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో వరుసగా మూడు సార్లు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించిన తెలంగాణ పోలీస్.. నాలుగోసారి కూడా అదే విజయపరంపరను కొనసాగించేందుకు సిద్ధమవుతోంది. జాతీయ స్థాయిలో మరోసారి ఛాంపియన్‌షిప్ సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని డీజీపీ సీవీ ఆనంద్ పోలీసు బృందాలకు పిలుపునిచ్చారు. పోలీసు డ్యూటీ మీట్‌లు కేవలం పోటీలు మాత్రమే కాదని, సిబ్బందిలో వృత్తి నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సమష్టి భావనను పెంపొందించే వేదికలని పేర్కొన్నారు.

తెలంగాణ పోలీసు అకాడమీలో నవంబర్ 23 నుంచి 26 వరకు నాలుగు రోజులపాటు నిర్వహించిన మూడో తెలంగాణ పోలీసు డ్యూటీ మీట్--2026 గురువారం ఘనంగా ముగిసింది. ముగింపు కార్యక్రమానికి హాజరైన డీజీపీ సీవీ ఆనంద్ విజేతలకు పతకాలు, బహుమతులు అందజేసి అభినందించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి ప్రోత్సాహకంగా ఇంక్రిమెంట్లు, అవార్డులు అందించే అంశాన్ని పరిశీలిస్తానని ప్రకటించారు.



● ఆరు విభాగాలు.. 421 మంది పోలీసుల ప్రతిభ

రాష్ట్రంలోని 16 జోనల్, ప్రత్యేక విభాగాలకు చెందిన 421 మంది అధికారులు, సిబ్బంది ఆరు విభాగాల్లోని 21 ఈవెంట్లలో పాల్గొన్నారు. శాస్త్రీయ దర్యాప్తు పద్ధతులు, యాంటీ సబోటేజ్ తనిఖీలు, డాగ్ స్క్వాడ్, ఐటీ నైపుణ్యాలు, పోలీసు ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల ద్వారా పోలీసు సిబ్బందిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతోపాటు క్షేత్రస్థాయి విధులకు అవసరమైన నైపుణ్యాలను మెరుగుపరచుకునే అవకాశం కలిగిందని డీజీపీ పేర్కొన్నారు.మొత్తం 63 మంది విజేతలకు 21 స్వర్ణ, 21 రజత, 21 కాంస్య పతకాలను అందజేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరి కృషిని అభినందించిన డీజీపీ.. పతకాలు సాధించడం ఎంత ముఖ్యమో, పోటీల ద్వారా కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడం కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు.

● సైబరాబాద్ కమిషనరేట్ మరోసారి సత్తా

మూడో తెలంగాణ పోలీసు డ్యూటీ మీట్‌లో సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. వరుసగా రెండో ఏడాది ఆల్‌రౌండర్ ఛాంపియన్‌షిప్ సాధించి తన ప్రతిభను చాటింది. శాస్త్రీయ దర్యాప్తు విభాగంలోనూ సైబరాబాద్



విజేతగా నిలవగా, వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌ను అదే కమిషనరేట్‌కు చెందిన ఎస్ఐ ఆర్.ప్రేమ్‌సాగర్ సాధించారు.

● విభాగాల వారీగా విజేతలు

- శాస్త్రీయ దర్యాప్తు: సైబరాబాద్ విజేత, హైదరాబాద్ ద్వితీయ స్థానం.
- యాంటీ సబోటేజ్ తనిఖీలు: ఐఎస్‌డబ్ల్యూ విజేత, సైబరాబాద్ ద్వితీయ స్థానం.
- ఐటీ నైపుణ్యాలు: తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో విజేత, హైదరాబాద్ ద్వితీయ స్థానం.
- డాగ్ స్క్వాడ్: సీఐడీ విజేత, యాదాద్రి ద్వితీయ స్థానం.
- వీడియోగ్రఫీ: రాజన్న సిరిసిల్ల (జోన్--3) విజేత, సీఐడీ ద్వితీయ స్థానం.
- ఫొటోగ్రఫీ: సైబరాబాద్ విజేత, మల్కాజిగిరి ద్వితీయ స్థానం.

● డ్యూటీ మీట్‌లపై ఆసక్తి తగ్గడం బాధాకరం

గతంతో పోలిస్తే పోలీసు సిబ్బందిలో డ్యూటీ మీట్‌లపై ఆసక్తి తగ్గడం బాధాకరమని డీజీపీ పేర్కొన్నారు. శాఖాపరమైన ప్రోత్సాహం





కొరవడటం, పోటీలకు సిద్ధమయ్యే సమయంలో కుటుంబాలకు దూరంగా ఉండాల్సి రావడం, విజేతలకు తగిన గుర్తింపు లభించకపోవడం ఇందుకు కారణాలుగా ఉన్నాయన్నారు. ప్రతిభావంతులైన సిబ్బందిని గుర్తించి తగిన ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

పోలీసు డ్యూటీ మీట్‌లు, క్రీడలు, బ్రాస్ బ్యాండ్ వంటి కార్యక్రమాలను నిర్వహించడం వల్ల సమయం వృథా అవుతుందనే భావన సరికాదన్నారు. ఇవి పోలీసు శాఖ ప్రతిష్ఠను పెంచడంతోపాటు సిబ్బందిలో సమష్టి స్ఫూర్తిని పెంపొందిస్తాయని తెలిపారు.

● బ్రాస్ బ్యాండ్‌లోనూ తెలంగాణకు రజతం

ఈ నెల 28న నిజామాబాద్‌లో క్రీడల ముగింపు వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

● ముంబయి జాతీయ పోటీలకు సన్నద్ధం

డిసెంబర్ 15 నుంచి 20 వరకు ముంబయిలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్ జరగనుంది. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలతోపాటు అన్ని బృందాలు సమష్టిగా కృషి చేసి జాతీయస్థాయిలో మరోసారి తెలంగాణకు ఛాంపియన్‌షిప్ తీసుకురావాలని డీజీపీ ఆకాంక్షించారు.

● నిర్వాహకులకు అభినందనలు

డ్యూటీ మీట్ చైర్మన్‌గా వ్యవహరించిన హైదరాబాద్ పోలీసు కమిషనర్ మహేశ్ భగవత్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతూ.. 16 జోనల్, ప్రత్యేక విభాగాల నుంచి 421 మంది పాల్గొన్నారని, ఆరు విభాగాల్లో 21 పోటీలు నిర్వహించినట్లు వివరించారు. నిరంతరం కష్టపడుతూ విధుల్లో ప్రతిభ కనబరిచే వారికి పేరు ప్రఖ్యాతలు లభిస్తాయని పేర్కొన్నారు.పోటీలను నిష్పక్షపాతంగా నిర్వహించిన 15 మంది న్యాయనిర్ణేతలను డీజీపీ అభినందించారు. కార్యక్రమ విజయవంతానికి కృషి చేసిన సీఐడీ డీజీ చారు సిన్హా, నిర్వాహకులు, సమన్వయకర్తలను ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో టీజీపీఏ డైరెక్టర్ అభిలాష బిష్ట్, సైబరాబాద్ పోలీసు కమిషనర్ ఎం. రమేష్, అదనపు పోలీసు కమిషనర్లు ఎం. శ్రీనివాసులు, తఫ్సీర్ ఇక్బాల్, ఇతర ఉన్నతాధికారులు, డీసీపీలు, న్యాయనిర్ణేతలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హైదరాబాద్ సిగలో మరో మణిహారం.. రూ.169 కోట్లతో నిర్మించే ట్విన్ టవర్లకు టెండర్ల ఆహ్వానం

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ శాశ్వత ప్రధాన కార్యాలయ నిర్మాణానికి రూ.169 కోట్లతో ఈ-టెండర్లు ఆహ్వానించింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఇజ్జత్‌నగర్‌లో కొత్తకుంట చెరువు సమీపంలోని 4.11 ఎకరాల్లో ఈ భవన సముదాయాన్ని నిర్మించనున్నారు. జీ+6, జీ+8 అంతస్తులతో రెండు ట్విన్ టవర్లు, మొత్తం 2,41,540 చదరపు అడుగుల నిర్మిత విస్తీర్ణం ఉండనుంది. ప్రజావాణి, కౌన్సిల్ హాల్, పౌర సేవా కేంద్రాలు, కమాండ్ సెంటర్‌తోపాటు నెట్ జీరో గ్రీన్ బిల్డింగ్ సదుపాయాలు ఇందులో ఏర్పాటు చేయనున్నారు.హైదరాబాద్ నగరంలో మరో ఐకానిక్ భవనం అందుబాటులోకి రానుంది. నగర పశ్చిమ ప్రాంతంలో వేగంగా విస్తరిస్తున్న సైబరాబాద్ పరిధికి ఆధునిక పరిపాలనా కేంద్రం నిర్మించనున్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ శాశ్వత ప్రధాన కార్యాలయ నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఇజ్జత్‌నగర్‌లో కొత్తకుంట చెరువు పక్కన 4.11 ఎకరాల విస్తీర్ణంలో ఈ ట్విన్ టవర్‌ను నిర్మించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం అంచనా వ్యయంగా రూ.169 కోట్లను ప్రకటించింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో నిర్వహించే పరిపాలనా కార్యకలాపాలన్నీ ఒకే ప్రాంగణం నుంచి సమన్వయం చేసుకునే ఛాన్స్ ఏర్పడనుంది.సీఎంసీ ప్రతిపాదించిన ఈ కార్యాలయ సముదాయం అత్యాధునిక సాంకేతికతతో కూడిన ట్విన్ టవర్ నెట్ జీరో గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్‌తో రూపుదిద్దుకోనుంది. రెండు పరస్పరం అనుసంధానమైన టవర్లతో నిర్మించే ఈ భవనాల మొత్తం నిర్మిత విస్తీర్ణం 2,41,540 చదరపు అడుగులుగా ఉండనుంది. ఇందులో ఒక టవర్‌ను గ్రౌండ్ ప్లస్ ఆరు అంతస్తులు, మరో టవర్‌ను గ్రౌండ్ ప్లస్ ఎనిమిది అంతస్తులతో నిర్మించనున్నారు. ప్రస్తుత పరిపాలనా అవసరాలతోపాటు భవిష్యత్తులో పెరిగే సిబ్బంది, విభాగాలు, ప్రజాసేవల అవసరాలను దృష్టిలో పెట్టుకుని కార్యాలయాలను రూపొందించనున్నారు.ఈ ప్రాంగణంలో ప్రజలకు నేరుగా సేవలు అందించే సదుపాయాలకు ప్రత్యేక ప్రాధాన్యం



ఇవ్వనున్నారు. కార్పొరేషన్ పాలకమండలి సమావేశాల నిర్వహణకు కౌన్సిల్ హాల్, ప్రజల ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రజావాణి హాల్, పౌర సేవల కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వీటితోపాటు ఆడిటోరియం, సమీకృత కమాండ్ కంట్రోల్ సెంటర్, వివిధ విభాగాల కార్యాలయాలు, అనుబంధ ప్రభుత్వ సంస్థలకు అవసరమైన స్థలాన్ని కేటాయించనున్నారు. దీనివల్ల పౌరులు వివిధ పనుల కోసం వేర్వేరు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. ఫిర్యాదుల స్వీకరణ, వాటి పరిష్కార పర్యవేక్షణ, విభాగాల మధ్య సమన్వయం మరింత సులభతరం కానుంది.

ఈ భవన సముదాయంలో పర్యావరణహిత నిర్మాణ విధానాలను అమలు చేయనున్నారు. పునరుత్పాదక ఇంధన వ్యవస్థలు, విద్యుత్ ఆదా చేసే మౌలిక సదుపాయాలు, నీటి పొదుపు చర్యలు, మురుగునీటి శుద్ధి, పునర్వినియోగ వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నారు. భవనంలోని విద్యుత్, నీటి వినియోగం తదితర అంశాలను సమర్థంగా పర్యవేక్షించేందుకు స్మార్ట్ బిల్డింగ్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను కూడా ప్రతిపాదించారు. స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా భవన రూపకల్పన చేయడం ద్వారా సహజ వెలుతురు, గాలి వినియోగాన్ని పెంచి, కృత్రిమ విద్యుత్ అవసరాన్ని తగ్గించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. నెట్ జీరో లక్ష్యానికి అనుగుణంగా శక్తి వినియోగం, వనరుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు.సైబరాబాద్ ప్రాంతంలో ఐటీ సంస్థలు, వాణిజ్య సముదాయాలు, నివాస కాలనీలు విస్తరిస్తుండటంతో మున్సిపల్ సేవల డిమాండ్ పెరుగుతోంది. రహదారులు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, నీటి సరఫరా, పట్టణ ప్రణాళిక, భవన అనుమతులు, పన్నుల వసూళ్లు వంటి అనేక అంశాలను సమర్థంగా నిర్వహించేందుకు ఆధునిక పరిపాలనా వ్యవస్థ అవసరం. ఈ నేపథ్యంలో కొత్త ప్రధాన కార్యాలయం కీలకంగా మారనుంది. ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి టెండర్ వివరాలను తెలంగాణ ప్రభుత్వ ఈ-టెండర్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచినట్లు సీఎంసీ తెలిపింది. టెండర్ల ప్రక్రియ పూర్తయి నిర్మాణ పనులు ప్రారంభమైన తర్వాత ఈ ప్రాజెక్టు పురోగతిపై స్పష్టత రానుంది.

అర్ధరాత్రి వరకు బోర్ తవ్వకాలు సాగుతున్నా ఎమ్మార్వో కార్యాలయం నిద్రావస్థలోనా?

క్షేత్రస్థాయి పర్యవేక్షణ ఎక్కడ?

- అక్రమాలను అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులే అక్రమార్కులకు రక్షణ కవచంగా మారుతున్నారా?
- బోర్ యంత్రాలు గర్జిస్తున్నా అధికారుల గొంతు మూగబోయిందా? చర్యలు తీసుకోలేని పరిస్థితి ఎందుకు?
- అనుమతి పత్రం చేతిలో ఉంటే చాలు.. నిబంధనలు బేఖాతర్ చేయవచ్చా? అధికారుల పర్యవేక్షణకు విలువ లేదా?
- ప్రజల గొంతులో నీటి చుక్క లేకున్నా.. భూగర్భ జలాలను తోడుకునేవారిపై చర్యలు తీసుకునే దమ్ము లేదా?
- పనులు జరుగుతున్నప్పుడు పట్టించుకోరు.. పూర్తయ్యాక తనిఖీల పేరుతో హడావుడి చేస్తారా? ఇదేనా రెవెన్యూ పాలన?
- ఎమ్మార్వో, ఆర్ఐలకు క్షేత్రస్థాయి పర్యవేక్షణ బాధ్యత లేదా? విధులు నిర్వహించేది కార్యాలయాలకే పరిమితమా?
- భూగర్భ జలాలు అడుగంటుతున్నాయనే హెచ్చరికలు బేఖాతరా? నీటి భవిష్యత్తును పణంగా పెడుతున్నారా?
- అనుమతుల్లో పరిమితులు స్పష్టం.. ఆచరణలో అమలుపై అనుమానాలు.. తనిఖీల నివేదికలు బయటపెడతారా?
- స్థానికుల ఫిర్యాదులు అధికారుల చెవికి చేరడం లేదా? లేక చేరినా కావాలనే పట్టించుకోవడం లేదా?
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని చెప్పే అధికారులు.. ఆచరణలో ఎందుకు వెనకడుగు వేస్తున్నారు?
- బోర్ పనులకు అనుమతి ఇచ్చిన శాఖే పర్యవేక్షణ మరిచిందా? బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నమా?
- ప్రభుత్వ నిబంధనల కంటే వ్యక్తుల ఇష్టాలే ముఖ్యమయ్యాయా? కుత్బుల్లాపూర్‌లో అధికారుల తీరు ఏమిటి?
- భూగర్భ జలాల పరిరక్షణకు బాధ్యత వహించాల్సిన అధికారులు ఎక్కడ? ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదా?
- అధికారుల మౌనం వెనుక కారణాలేమిటి? బోర్ నిర్మాణంపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశిస్తారా?





కుత్బుల్లాపూర్, నవంబర్ 26 (పీపుల్స్ న్యూస్): గాజులరామారంలో భూగర్భ జలాల పరిరక్షణ అధికారుల పర్యవేక్షణ ప్రశ్నార్థకంగా మారుతోందా? అనుమతుల పేరుతో నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారా? ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు బోర్‌వెల్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నా సంబంధిత రెవెన్యూ అధికారులు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. కళ్లముందే పనులు జరుగుతున్నా కుత్బుల్లాపూర్ ఎమ్మార్వో, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గాజులరామారం పరిధిలోని సర్వే నంబర్లు 178 నుంచి 196 వరకు, ప్లాట్ నంబర్ 33కు సంబంధించి భూగర్భ జల శాఖ జారీ చేసిన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇప్పుడు వివాదానికి కేంద్రంగా మారింది. ఎడమకంటి రవికాంత్ రెడ్డి పేరుతో 2026 నవంబర్ 6న గృహ సముదాయ అవసరాల కోసం బోర్‌వెల్‌కు అనుమతి జారీ చేసినట్లు పత్రంలో ఉంది. ఈ అనుమతి 2028 నవంబర్ 5 వరకు చెల్లుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. అయితే అదే అనుమతి పత్రంలో సంబంధిత ప్రాంతాన్ని 'ఓవర్ ఎక్స్‌ప్లాయిటెడ్' కేటగిరీగా గుర్తించడం గమనార్హం. రోజుకు 2 క్యూబిక్ మీటర్లు, ఏడాదికి 730 క్యూబిక్ మీటర్ల నీటి వినియోగానికి అనుమతి ఇచ్చారు. 165 మిల్లీమీటర్ల వ్యాసంతో 120 మీటర్ల లోతు వరకు ఒక బోర్‌వెల్ ప్రతిపాదించినట్లు నమోదు చేశారు.

● 120 మీటర్లకే నీళ్లు వస్తున్నాయా?

స్థానికంగా వెయ్యి అడుగులకు పైగా బోర్లు వేసినా నీరు లభించడం లేదని ప్రజలు చెబుతున్న పరిస్థితుల్లో 120 మీటర్ల లోతులో నీటి లభ్యతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అసలు బోర్ వేసిన ప్రాంతంలో భూగర్భ జలాల పరిస్థితి ఏమిటి? అనుమతి ఇచ్చే ముందు శాస్త్రీయంగా పరిశీలించారా? అనుమతిలో పేర్కొన్న లోతులోనే బోర్ నిర్మాణం జరిగిందా? వాస్తవంగా ఎంత నీటిని వినియోగిస్తున్నారు? అన్న అంశాలపై అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

వాటర్ బోర్డు డైరెక్టర్ గతంలో వెల్లడించిన వ్యాఖ్యలకు, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న పరిస్థితులకు మధ్య వ్యత్యాసం ఉందా? అన్న సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. నీటి లభ్యత, భూగర్భ జలాల పరిస్థితిపై సంబంధిత శాఖలు వాస్తవాలను వెల్లడించాలి.

● అర్ధరాత్రి వరకు పనులు.. అధికారుల పర్యవేక్షణ ఏది?

అసలు వివాదం బోర్‌వెల్‌కు అనుమతి ఇవ్వడంతోనే ముగిసిపోదు. అనుమతి పొందిన వ్యక్తి నిబంధనల ప్రకారమే పనులు చేపడుతున్నారా? అనుమతించిన లోతు, నీటి వినియోగ పరిమితులను పాటిస్తున్నారా? బోర్ నిర్మాణ సమయంలో సంబంధిత అధికారులు పర్యవేక్షిస్తున్నారా? అన్నది కీలకం. స్థానికుల ఆరోపణల ప్రకారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు బోర్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇంత జరుగుతున్నా కుత్బుల్లాపూర్ ఎమ్మార్వో, ఆర్ఐలు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాలు, నిబంధనల ఉల్లంఘనలపై పర్యవేక్షించాల్సిన అధికారులే మౌనం వహిస్తే ప్రజలకు న్యాయం జరిగేదెలా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

● అక్రమార్కులకు అండగా అధికారులున్నారా?

ప్రభుత్వ నిబంధనలను అమలు చేయాల్సిన రెవెన్యూ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సింది పోయి, సంబంధిత పనులపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను గుర్తించాల్సిన ఎమ్మార్వో, ఆర్ఐలు ఎందుకు స్పందించడం లేదు? పనులు కొనసాగుతున్న సమయంలో తనిఖీలు నిర్వహించారా? ఉల్లంఘనలు గుర్తిస్తే ఏ చర్యలు తీసుకున్నారు? అన్న వివరాలను బహిర్గతం చేయాలి. అక్రమాలకు ఎవరైనా అండగా నిలుస్తున్నారనే అనుమానాలకు తావులేకుండా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలి. విధి నిర్వహణలో నిర్లక్ష్యం జరిగిందా? ఫిర్యాదులు అందినా పట్టించుకోలేదా? అన్న అంశాలపై ఉన్నతాధికారులు విచారణ జరిపించాలి. అనుమతులున్నాయనే ధీమాతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకుంటారా? ఒకవైపు ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతుంటే మరోవైపు భూగర్భ జలాల వినియోగంపై పర్యవేక్షణ లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. అనుమతి పత్రంలో పేర్కొన్న రోజువారీ నీటి పరిమితి అమలవుతోందా? బోర్‌వెల్ ద్వారా నీటి వృథా జరుగుతోందా? నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్నారా? అన్న అంశాలపై భూగర్భ జల శాఖ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టాలి.



హైదరాబాద్ ట్రాఫిక్‌కు చెక్.. ఐటీ కారిడార్‌లో వన్‌వే, బస్సులకు స్పెషల్ లైన్.. డీజీపీ సీవీ ఆనంద్ ప్రకటన





హైదరాబాద్ : ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు కీలక ప్రతిపాదనలకు శ్రీకారం చుడుతున్నారు. సైబరాబాద్‌లో వన్‌వే లూప్‌లు, బస్సులకు ప్రత్యేక లేన్లు ఏర్పాటు చేసే ప్రతిపాదనలను డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఐటీ కంపెనీల పనివేళలు మార్చాలని.. ఉద్యోగులు ప్రజా రవాణాను వినియోగించాలని సూచించారు. ప్రస్తుతం సైబరాబాద్‌లో సుమారు 10 లక్షల మంది పనిచేస్తుండగా.. 80 శాతం మంది వ్యక్తిగత వాహనాల్లో వస్తున్నారని తెలిపారు. రోడ్ల విస్తరణ, ఫ్లైఓవర్లు, మెట్రో, ఎంఎంటీఎస్ సేవల మెరుగుదలపైనా దృష్టి పెట్టాలని డీజీపీ కోరారు. హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ సరికొత్త చర్యలపై దృష్టి సారించాయి. సైబరాబాద్ ప్రాంతంలో వన్‌వే విధానాలు, బస్సులకు ప్రత్యేక లేన్లు తీసుకొచ్చే ప్రతిపాదనలను డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రజలు, ఐటీ సంస్థలు పోలీసులకు సహకరించాలని కోరారు. గురువారం నిర్వహించిన 'సైబరాబాద్ మూవ్స్-2026' సదస్సులో డీజీపీ సీవీ ఆనంద్ ఈ వ్యాఖ్యలు చేశారు. సైబరాబాద్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాల్లో వాహనాల రద్దీని నియంత్రించేందుకు జూబ్లీహిల్స్, కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ఉన్న తరహాలో వన్‌వే లూప్‌లు ఏర్పాటు చేయాలని డీజీపీ సూచించారు. వీటితోపాటు కీలక సిగ్నళ్ల వద్ద ఫ్రీ లెఫ్ట్‌లు, యూటర్న్‌లను క్రమబద్ధీకరించడం ద్వారా ట్రాఫిక్ రద్దీని మరింత మెరుగ్గా మెయింటైన్ చేయవచ్చని పోలీస్ బాస్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఐటీ ఉద్యోగుల రాకపోకల కోసం ప్రత్యేక క్యారేజ్ వే, బస్సుల కోసం కౌంటర్‌ఫ్లో బస్ లేన్లను పరిశీలించాలని సూచించారు. ఈ మార్పులను అమలు చేసే సమయంలో మొదటి రెండు, మూడు రోజులు ప్రజల నుంచి విమర్శలు, అసౌకర్యంపై ఫిర్యాదులు రావచ్చని, వాటికి భయపడకుండా అధికారులు ధైర్యంగా ముందుకు వెళ్లాలని పోలీసు సిబ్బందికి సూచించారు. గత 20 ఏళ్లలో సైబరాబాద్ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందిందని డీజీపీ సీవీ ఆనంద్ గుర్తుచేశారు. ప్రస్తుతం ఐటీ కారిడార్ ప్రాంతంలో సుమారు 10 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. వారిలో దాదాపు 80 శాతం మంది తమ పర్సనల్ వెహికల్స్‌లోనే ఆఫీసులకు వస్తున్నారని పేర్కొన్నారు. దీంతో ఐటీ కారిడార్‌లో వాహనాల సంఖ్య పెరిగి ట్రాఫిక్ సమస్య తీవ్రం అవుతోందని వివరించారు. అదే సమయంలో అన్ని ఐటీ కంపెనీలకు ఒకే సమయంలో ఉద్యోగుల పనివేళలు ఉండటం కూడా భారీగా ట్రాఫిక్ రద్దీకి ఒక కారణమని డీజీపీ అభిప్రాయం వెల్లడించారు. ఈ క్రమంలోనే ఆయా కంపెనీలు తమ ఉద్యోగుల పనివేళలను వేర్వేరుగా నిర్ణయించే అంశాన్ని పరిశీలించాలని హితవు పలికారు. ఉద్యోగులు సొంత కార్లలో రావడాన్ని హోదాకు చిహ్నంగా భావించకుండా ప్రజా రవాణాను వినియోగించుకోవాలని సూచించారు. సైబరాబాద్ ప్రాంతంలో రహదారుల అనుసంధానం సరిగా లేకపోవడం వల్ల వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ముఖ్యంగా వర్షాలు కురిసినప్పుడు ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రంగా మారుతోందని.. ప్రయాణికులు గంటల తరబడి రోడ్లపైనే చిక్కుకుపోయి నరకం అనుభవిస్తున్నారని చెప్పారు. మియాపూర్ పరిసరాల్లో రోడ్ల విస్తరణ చేపట్టాలని, ఐటీ కంపెనీల భాగస్వామ్యంతో ఫ్లైఓవర్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు. మెట్రో రైలు విస్తరణ, ఎంఎంటీఎస్, ఆర్టీసీ బస్సు సేవలను మెరుగుపరిస్తేనే ట్రాఫిక్ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడ్డారు.

సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ద్వారా సుమారు 10 లక్షల మంది ఐటీ ఉద్యోగులకు ప్రజా రవాణాపై అవగాహన కల్పించాలని సూచించారు.

హైదరాబాద్‌లో ఇతర రాష్ట్రాల క్యాబ్‌లు.. స్థానిక డ్రైవర్లకు కొత్త కష్టాలు



సమావేశంలో ఓలా, ఉబర్ వంటి యాప్ ఆధారిత సేవల సంస్థలకు పలు సూచనలు చేశారు. ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ అయిన వాహనాలను క్యాబ్ సేవలకు వినియోగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డ్రైవర్ల నేపథ్యాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించాలని, వారి వ్యక్తిగత వివరాలను అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించుకునేలా భద్రపరచాలని ఆదేశించారు. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు క్యాబ్ సేవల్లో పాల్గొనే వాహనాలు, డ్రైవర్ల వివరాలపై అగ్రిగేటర్లు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. వాహనాల తనిఖీలకు గిగ్ వర్కర్ల సంఘం డిమాండ్

తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ సైతం ఈ అంశాన్ని పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లింది. ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్‌తో హైదరాబాద్‌లో క్యాబ్ సేవలు అందిస్తున్న వాహనాలపై తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేస్తోంది. 2026 అక్టోబరులో జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎం.చంద్రశేఖర్ గౌడ్‌కు వినతిపత్రం సమర్పించి, ఇతర రాష్ట్రాల వాహనాల వాణిజ్య కార్యకలాపాలను పరిశీలించాలని కోరింది. ప్రైవేటు వినియోగం కోసం రిజిస్ట్రేషన్ చేసిన వైట్ బోర్డు వాహనాలను ప్రయాణికుల రవాణాకు వాణిజ్యపరంగా ఉపయోగిస్తున్నారనే ఆరోపణలపైనా చర్యలు చేసింది.

హైదరాబాద్‌లో ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ అయిన క్యాబ్‌లు, వాణిజ్య వాహనాల వినియోగం పెరుగుతుండటంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. 2021--22 కాగ్ నివేదిక ప్రకారం 6,376 వాహనాలు 12 నెలలకు మించి తెలంగాణలో ఉన్నప్పటికీ రాష్ట్ర రిజిస్ట్రేషన్ పొందలేదు. దీంతో రూ.72.51 లక్షల రీ-అసైన్‌మెంట్ ఫీజుల ఆదాయం కోల్పోయినట్లు అంచనా. స్థానిక డ్రైవర్ల ప్రయోజనాలను కాపాడేందుకు తనిఖీలు చేపట్టాలని గిగ్ వర్కర్ల సంఘం కోరుతోంది. అగ్రిగేటర్ పాలసీ ద్వారా క్యాబ్ సేవలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. 6,376 వాహనాలపై కాగ్ గుర్తింపు

ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వాహనాలు తెలంగాణలో దీర్ఘకాలంగా తిరుగుతున్న అంశాన్ని కాగ్ తన నివేదికలో ప్రస్తావించింది. 2021--22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ రంగ ఆడిట్ నివేదికలో 6376 ఇతర రాష్ట్రాల వాహనాలు 12 నెలలకు మించి తెలంగాణలో ఉన్నప్పటికీ ఇక్కడి రిజిస్ట్రేషన్ చేయించుకోలేదని గుర్తించింది. వీటి నుంచి వసూలు కావాల్సిన రీ-అసైన్‌మెంట్ ఫీజుల రూపంలో రూ.72.51 లక్షల ఆదాయాన్ని రవాణా శాఖ కోల్పోయినట్లు అంచనా. శాఖకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌లో వాహనాలు 12 నెలలకు మించి ఇతర రాష్ట్రాల్లో కొనసాగుతున్నప్పుడు అధికారులకు హెచ్చరికలు పంపించే వ్యవస్థ లేకపోవడమే ఈ నష్టానికి కారణమని నివేదిక పేర్కొంది. అగ్రిగేటర్లకు గతంలోనే ట్రాఫిక్ పోలీసుల హెచ్చరికలు హైదరాబాద్‌లో ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్‌తో నడుస్తున్న క్యాబ్‌ల అంశాన్ని ట్రాఫిక్ పోలీసులు గతంలోనే ప్రస్తావించారు. 2023 మే 23న క్యాబ్ ఆపరేటర్లు, డ్రైవర్ల సంఘాలతో నిర్వహించిన

తుక్కుగూడలో ఐటీ, పరిశ్రమల హబ్.. ఫ్యూచర్‌సిటీకి ఫ్యాబ్‌సిటీ అనుసంధానం.. 20 వేల మందికి ఉద్యోగాలు

భారత్ ఫ్యూచర్‌సిటీకి అనుసంధానంగా తుక్కుగూడలోని ఫ్యాబ్‌సిటీని ఐటీ, ఎలక్ట్రానిక్స్, పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. సెజ్ నుంచి డీ-నోటిఫై అయిన 922 ఎకరాల్లో పరిశ్రమల ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు రెడీ చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 వేల మందికి ఉపాధి లభించే అవకాశముందని అధికారులు చెబుతున్నారు హైదరాబాద్ వెస్ట్ మాదిరిగానే నగర దక్షిణ ప్రాంతంలోనూ పారిశ్రామిక, ఐటీ అభివృద్ధికి తెలంగాణ సర్కార్ చర్యలు తీసుకుంటుంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్‌సిటీకి అనుసంధానంగా తుక్కుగూడలోని ఫ్యాబ్‌సిటీని ఐటీ, ఎలక్ట్రానిక్స్, పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు రెడీ అవుతుంది. ఇందుకు సంబంధించి రెవెన్యూ, పరిశ్రమల శాఖ అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఫ్యాబ్‌సిటీ ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) పరిధిలోని 922 ఎకరాలను కేంద్ర ప్రభుత్వం డీ-నోటిఫై చేయడంతో ఈ భూములను ఇతర పారిశ్రామిక అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఐటీ సంస్థలు, ఎలక్ట్రానిక్స్ కంపెనీలు, వివిధ పరిశ్రమల ఏర్పాటుకు ఈ ప్రాంతం అనువుగా ఉంటుందని అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు.

ఫ్యాబ్‌సిటీకి సుమారు 15 కిలోమీటర్ల దూరంలోనే మీర్‌ఖాన్‌పేట ప్రాంతంలో ఫ్యూచర్‌సిటీ నిర్మాణం జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఈ రెండు ప్రాంతాలను పారిశ్రామికంగా అనుసంధానించాలని ప్రభుత్వం డిసైడ్ అయింది. మధ్యలోని ప్రాంతాల్లోనూ ఐటీ సంస్థలు, ఎలక్ట్రానిక్స్ కంపెనీలు, అనుబంధ పరిశ్రమలు ఏర్పాటయ్యేలా కార్యాచరణ సిద్ధం



చేస్తున్నారు. ఇప్పటికే మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కందుకూరు, షాబాద్ మండలాల్లో మల్టీనేషనల్ కంపెనీలు, సంస్థలు పరిశ్రమలను నెలకొల్పుతున్నాయి. ఈ అభివృద్ధిని మరింత విస్తరించి తుక్కుగూడ ఫ్యాబ్‌సిటీని కీలక పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దాలని సర్కార్ టార్గెట్‌గా పెట్టుకుంది.

20 వేల మందికి ఉపాధి అవకాశాలుఫ్యాబ్‌సిటీలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్ రంగాలకు చెందిన సంస్థలు ఏర్పాటైతే స్థానిక యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లతోపాటు మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీర్లకు ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 20 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. పరిశ్రమల ఏర్పాటుతో రవాణా, గిడ్డంగులు, నిర్వహణ, ఇతర సేవారంగాల్లోనూ ఉపాధి పెరిగే అవకాశం ఉంది. ప్రత్యేక రహదారులు.. మౌలిక వసతులుపరిశ్రమల స్థాపనకు అవసరమైన విద్యుత్, నీటి సరఫరా, రహదారులు వంటి మౌలిక వసతుల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఫ్యాబ్‌సిటీ, ఫ్యూచర్‌సిటీల్లో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రహదారుల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతాలకు హైదరాబాద్- శ్రీశైలం రహదారి, శంషాబాద్- గచ్చిబౌలి బాహ్యవలయ రహదారులు ప్రధాన అనుసంధాన మార్గాలుగా ఉన్నాయి. వీటికి అదనంగా ఫ్యూచర్‌సిటీకి రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ నుంచి రతన్ టాటా గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్-1 పేరుతో 300 అడుగుల వెడల్పుతో రహదారి నిర్మిస్తున్నారు. అలాగే శంషాబాద్ నుంచి తుక్కుగూడ మీదుగా కొంగరకలాన్‌లోని రంగారెడ్డి కలెక్టరేట్ వరకు మరో రహదారిని సైతం నిర్మించనున్నారు. ఈ రహదారులు అందుబాటులోకి వస్తే ఫ్యాబ్‌సిటీ, ఫ్యూచర్‌సిటీల మధ్య రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతోపాటు పరిశ్రమల రాకకు అనుకూల వాతావరణం ఏర్పడనుంది. శరవేగంగా ఫ్యూచర్ సిటీ అభివృద్ధి పనులుఇదిలా ఉండగా.. ప్రస్తుతం భారత్ ఫ్యూచర్ సిటీలో అభివృద్ధి, మౌలిక సదుపాయాల పనులు వేగంగా సాగుతున్నాయి. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రధాన కార్యాలయం ప్రారంభమై లేఅవుట్, భవన అనుమతుల ప్రక్రియ చురుగ్గా కొనసాగుతోంది. మీర్‌ఖాన్‌పేట వద్ద యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్ నిర్మాణం జరుగుతుండగా.. రేడియల్ రోడ్ల కనెక్టివిటీ పనులు పురోగతిలో ఉన్నాయి. అమెజాన్ వెబ్ సర్వీసెస్ డేటా సెంటర్‌కు ఇప్పటికే శంకుస్థాపన జరగ్గా.. టీసీఎస్ హైపర్‌వాల్ట్ ఏఐ క్యాంపస్ ప్రతిపాదనలు ఉన్నాయి. మరోవైపు మాస్టర్ ప్లాన్ రూపకల్పనతో పాటు, శంషాబాద్ విమానాశ్రయం నుంచి మెట్రో కారిడార్, రీజినల్ రింగ్ రోడ్డు వంటి భారీ ప్రాజెక్టుల పనులు వివిధ దశల్లో ముందుకు సాగుతున్నాయి.

ఆల్‌రౌండర్ ముల్డర్.. టెస్టు చరిత్రలో

సరికొత్త సంచలనం!



ఒకే మ్యాచ్‌లో శతకం.. ఏడు వికెట్లు..
ట్రిపుల్ సెంచరీతో మరో ప్రపంచ రికార్డు

దక్షిణాఫ్రికా క్రికెటర్ వియాన్ ముల్డర్ టెస్టు క్రికెట్ చరిత్రలో అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. బ్యాటింగ్, బౌలింగ్‌లో అసాధారణ ప్రతిభ కనబరుస్తూ 149 ఏళ్ల టెస్టు చరిత్రలో తనకంటూ ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో టెస్టులో శతకం సాధించడంతోపాటు బౌలింగ్‌లో ఏకంగా ఏడు వికెట్లు పడగొట్టి ఔరా అనిపించాడు. గతంలో జింబాబ్వేతో జరిగిన టెస్టులో ట్రిపుల్ సెంచరీ సాధించిన ముల్డర్.. తాజాగా ఏడు వికెట్ల ఘనతను కూడా అందుకోవడంతో ఈ రెండు రికార్డులు సాధించిన తొలి ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు.సెంచూరియన్ వేదికగా జరిగిన రెండో టెస్టులో ముల్డర్ 178 బంతుల్లో 100 పరుగులు సాధించాడు. అనంతరం బౌలింగ్‌లోనూ ప్రత్యర్థి బ్యాటర్లకు చుక్కలు చూపించాడు. కేవలం 11 ఓవర్లలో 31 పరుగులిచ్చి ఏడు వికెట్లు పడగొట్టాడు. దీంతో ఒకే టెస్టులో సెంచరీతోపాటు ఏడు వికెట్లు తీసిన ఐదో ఆటగాడిగా నిలిచాడు. 1980లో ఇంగ్లండ్ దిగ్గజం ఇయాన్ బోథమ్ తర్వాత ఈ ఘనత సాధించిన తొలి ఫాస్ట్ బౌలర్‌గా గుర్తింపు పొందాడు. దక్షిణాఫ్రికా తరఫున ఈ ఘనత సాధించిన తొలి క్రికెటర్‌గా నిలవడం విశేషం.గత ఏడాది జింబాబ్వేతో జరిగిన టెస్టులో ముల్డర్ అజేయంగా 367 పరుగులు సాధించాడు. తాజాగా బంగ్లాదేశ్‌పై ఏడు వికెట్లు పడగొట్టడంతో టెస్టు చరిత్రలో ట్రిపుల్ సెంచరీతోపాటు ఒక ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లు తీసిన తొలి ఆటగాడిగా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు.ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌ను 494/7 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 184 పరుగులకే ఆలౌటైంది. దీంతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ 219 పరుగుల భారీ తేడాతో విజయం సాధించి రెండు టెస్టుల సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీ ప్ చేసింది. ఈ విజయంతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పట్టికలో దక్షిణాఫ్రికా అగ్రస్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది. ముల్డర్ అసాధారణ ప్రదర్శనకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ పురస్కారం దక్కింది.

బుమ్రా బౌలింగ్ ప్రత్యేకం..

భయపడేది లేదు!



●రెండో టెస్టుకు సిద్ధమైన కివీస్ కెప్టెన్ లాథమ్.. బ్యాటింగ్ శైలిలో మార్పులుండవని స్పష్టీకరణ

క్రైస్ట్‌చర్చ్: భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాను ఎదుర్కోవడం సవాలుతో కూడుకున్నదని న్యూజిలాండ్ కెప్టెన్ టామ్ లాథమ్ పేర్కొన్నాడు. అయితే అతడి బౌలింగ్‌ను ఎదుర్కొనేందుకు ప్రత్యేక వ్యూహాలేమీ లేవని, తన సహజమైన బ్యాటింగ్ శైలినే కొనసాగిస్తానని స్పష్టం చేశాడు.భారత్-న్యూజిలాండ్ మధ్య శుక్రవారం నుంచి రెండో టెస్టు ప్రారంభం కానుంది. తొలి టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ లాథమ్‌ను బుమ్రా డకౌట్ చేశాడు. ఈ నేపథ్యంలో బుమ్రా బౌలింగ్‌పై స్పందించిన లాథమ్.. అతడి బౌలింగ్ శైలి ప్రత్యేకంగా ఉంటుందని, కొత్త బంతితోనైనా, పాత బంతితోనైనా ఎదుర్కోవడం కష్టమేనని తెలిపాడు. బంతిని నిశితంగా గమనిస్తూ స్వింగ్‌ను అంచనా వేసి ఆడటమే తన వ్యూహమని చెప్పాడు.విఫలమైనప్పుడు కొత్త ప్రయోగాలు చేయడం కంటే తమ ఆటపై స్పష్టతతో ఉండటం ముఖ్యమని అభిప్రాయపడ్డాడు. న్యూజిలాండ్ పరిస్థితుల్లో ఓపెనింగ్ చేయడం సవాలుతో కూడుకున్నదని, జట్టు కోసం తన వంతు బాధ్యతను సమర్థంగా నిర్వర్తించడమే లక్ష్యమని పేర్కొన్నాడు.

వైభవ్ విధ్వంసానికి క్రిస్ గేల్ ఫిదా!

53 బంతుల్లోనే డబుల్ సెంచరీ.. వన్డేల్లో ట్రిపుల్ సెంచరీ సాధించడం అసాధ్యమేమీ కాదు.. యువ సంచలనంపై యూనివర్స్ బాస్ ప్రశంసలు



ఇంటర్నెట్ డెస్క్: భారత యువ క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీ తన అసాధారణ బ్యాటింగ్‌తో ప్రపంచ క్రికెట్ దిగ్గజాలను ఆశ్చర్యపరుస్తున్నాడు. తాజాగా ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో కేవలం 53 బంతుల్లోనే 204 పరుగులు సాధించి సంచలనం సృష్టించాడు. అతడి విధ్వంసకర ఇన్నింగ్స్‌పై వెస్టిండీస్ మాజీ దిగ్గజ క్రికెటర్ క్రిస్ గేల్ ప్రశంసల వర్షం కురిపించాడు. వైభవ్ బ్యాటింగ్ గురించి తెలిసినప్పుడు తొలుత తాను నమ్మలేకపోయానని, 12 ఓవర్లలో డబుల్ సెంచరీ అంటే టీ20 మ్యాచ్ అయి ఉంటుందని భావించానని వెల్లడించాడు.యూఏఈతో జరిగిన ఈ మ్యాచ్‌లో వైభవ్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. క్రీజులోకి వచ్చినప్పటి నుంచే ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఫోర్లు, సిక్సర్లతో మైదానంలోని అన్ని వైపులా పరుగుల వరద పారించాడు. కేవలం 16 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత 28 బంతుల్లోనే శతకాన్ని అందుకున్నాడు. దూకుడు తగ్గించకుండా బ్యాటింగ్ కొనసాగిస్తూ 40 బంతుల్లో 150 పరుగులు సాధించాడు. చివరకు 52 బంతుల్లో డబుల్ సెంచరీ మార్కును చేరుకుని, 53 బంతుల్లో 204 పరుగులతో అజేయంగా నిలిచాడు. అతడి ఇన్నింగ్స్‌లో ఏకంగా 28 సిక్సర్లు, ఏడు ఫోర్లు ఉండటం విశేషం. 384.90 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు సాధించి ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించాడు.**టీ20 మ్యాచ్ అనుకున్నా..**వైభవ్ అద్భుత ఇన్నింగ్స్‌పై స్పందించిన క్రిస్ గేల్ ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. ఈ మ్యాచ్ గురించి తన ఫోన్‌కు వరుసగా సందేశాలు వచ్చాయని, ఏం జరిగిందో తెలుసుకునేందుకు ప్రయత్నించానని తెలిపాడు. 12 ఓవర్లలో ఒక ఆటగాడు డబుల్ సెంచరీ చేశాడని చెప్పడంతో అది టీ20 మ్యాచ్ అయి ఉంటుందని భావించానన్నాడు. అయితే అది 50 ఓవర్ల మ్యాచ్ అని తెలియడంతో ఆశ్చర్యపోయానని పేర్కొన్నాడు. 15 ఏళ్ల వయసులో ఇంత తక్కువ బంతుల్లో డబుల్ సెంచరీ చేయడం అసాధారణమని కొనియాడాడు. 28 సిక్సర్లు బాదడం సాధారణ విషయం కాదని, వైభవ్ నిజంగా అద్భుతమైన ప్రతిభ కలిగిన ఆటగాడని ప్రశంసించాడు. **వన్డేల్లో ట్రిపుల్ సెంచరీ సాధ్యమే!** వైభవ్ ఇదే తరహా దూకుడు కొనసాగిస్తే భవిష్యత్తులో వన్డే క్రికెట్‌లో ట్రిపుల్ సెంచరీ సాధించడం కూడా సాధ్యమేనని గేల్ అభిప్రాయపడ్డాడు. ప్రస్తుత యువ క్రికెటర్లు ఆట స్వరూపాన్నే మార్చేస్తున్నారని, వైభవ్ కూడా క్రికెట్‌కు కొత్త దిశ చూపిస్తున్నాడని పేర్కొన్నాడు. అతడికి మరిన్ని అవకాశాలు రావాలని ఆకాంక్షించాడు. ఇలాంటి ప్రతిభావంతుడైన ఆటగాడు అవకాశాలు లేక కనుమరుగవకూడదని, అంతర్జాతీయ స్థాయిలోనూ తరచూ ఆడుతూ తన ప్రతిభను నిరూపించుకోవాలని సూచించాడు. **బేబీ బాస్ పేరు వద్దు.. సొంత గుర్తింపు తెచ్చుకో!** వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర బ్యాటింగ్ కారణంగా అభిమానులు అతడిని క్రిస్ గేల్‌తో పోలుస్తూ 'బేబీ బాస్' అని పిలుస్తున్నారు. గేల్‌ను క్రికెట్ అభిమానులు 'యూనివర్స్ బాస్'గా గుర్తిస్తారు. అయితే ఈ పేరుతో కాకుండా వైభవ్ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని గేల్ సూచించాడు. ప్రతి ఆటగాడికి ప్రత్యేకమైన పేరు, ఆటతీరు, గుర్తింపు ఉండాలని పేర్కొన్నాడు. రోహిత్ శర్మను హిట్‌మ్యాన్‌గా, ఏబీ డివిలియర్స్‌ను 360 డిగ్రీల ఆటగాడిగా పిలుస్తారని గుర్తుచేశాడు. అలాగే వైభవ్ కూడా తన ఆటతో ప్రత్యేకమైన బ్రాండ్‌ను నిర్మించుకోవాలని హితవు పలికాడు.'బేబీ బాస్' అనే పేరు ఎక్కువకాలం సరిపోదని, భవిష్యత్తులో వైభవ్ మరింత ఎదుగుతాడని గేల్ చమత్కరించాడు. అయితే 'యూనివర్స్ బాస్' అనే పేరు మాత్రం తనదేనని నవ్వుతూ వ్యాఖ్యానించాడు. **రికార్డుల వేటలో యువ సంచలనం** వైభవ్ సాధించిన ఈ డబుల్ సెంచరీతో లిస్ట్-ఎ క్రికెట్‌లో అత్యంత చిన్న వయసులో ద్విశతకం సాధించిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. 15 ఏళ్ల 242 రోజుల వయసులో ఈ ఘనత అందుకోవడం విశేషం. అతడి విధ్వంసకర ఇన్నింగ్స్ కారణంగా యూఏఈ నిర్దేశించిన 250 పరుగుల లక్ష్యాన్ని భారత్-ఎ జట్టు కేవలం 14.2 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. 204 పరుగులతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన వైభవ్ ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్‌లోనూ ఎప్పుడు అవకాశం దక్కించుకుంటాడన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. చిన్న వయసులోనే రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తున్న ఈ యువ ఆటగాడు భవిష్యత్తులో మరిన్ని

టెస్టు క్రికెట్‌లో ముల్డర్

అరుదైన ప్రపంచ రికార్డు

- ట్రిపుల్ సెంచరీతో పాటు ఏడు వికెట్లు.. 149 ఏళ్ల టెస్టు చరిత్రలో సరికొత్త అధ్యాయం.. బంగ్లాదేశ్‌పై దక్షిణాఫ్రికా ఘన విజయం



సెంచూరియన్: దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ వియాన్ ముల్డర్ టెస్టు క్రికెట్ చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాడు. బ్యాటింగ్, బౌలింగ్‌లో అద్భుత ప్రతిభ కనబరుస్తూ అరుదైన ప్రపంచ రికార్డును సృష్టించాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో టెస్టులో శతకం సాధించడంతోపాటు ఏడు వికెట్లు పడగొట్టి సత్తాచాటాడు. గతంలో జింబాబ్వేతో జరిగిన టెస్టులో అజేయంగా 367 పరుగులతో ట్రిపుల్ సెంచరీ సాధించిన ముల్డర్.. తాజాగా ఏడు వికెట్ల ఘనతను కూడా అందుకోవడంతో టెస్టు క్రికెట్‌లో ట్రిపుల్ సెంచరీ, ఒక ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లు సాధించిన తొలి ఆటగాడిగా చరిత్రకెక్కాడు.**బ్యాటింగ్‌లో శతకం.. బౌలింగ్‌లో ఏడు వికెట్లు** బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో టెస్టులో ముల్డర్ తన ఆల్‌రౌండ్ ప్రతిభను మరోసారి నిరూపించుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన అతడు 178 బంతుల్లో 100 పరుగులు సాధించాడు. క్రీజులో నిలదొక్కుకుని జట్టుకు కీలక పరుగులు అందించాడు. అనంతరం బౌలింగ్‌లోనూ ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు. రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 11 ఓవర్లు బౌలింగ్ చేసి 31 పరుగులు మాత్రమే ఇచ్చి ఏడు వికెట్లు పడగొట్టాడు. బంగ్లాదేశ్ బ్యాటింగ్ ఆర్డర్‌ను కుప్పకూల్చడంలో కీలక పాత్ర పోషించాడు. దీంతో ఒకే టెస్టులో సెంచరీతోపాటు ఏడు వికెట్లు సాధించిన ఐదో ఆటగాడిగా నిలిచాడు. **ట్రిపుల్ సెంచరీతో అరుదైన ఘనత** ముల్డర్ గతంలో జింబాబ్వేతో జరిగిన టెస్టులో అజేయంగా 367 పరుగులు సాధించి సంచలనం సృష్టించాడు. వ్యక్తిగతంగా ట్రిపుల్ సెంచరీ సాధించడమే కాకుండా, తన బ్యాటింగ్ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటాడు. తాజాగా బంగ్లాదేశ్‌పై ఏడు వికెట్లు పడగొట్టడంతో అతడి రికార్డు మరింత ప్రత్యేకంగా మారింది. తన టెస్టు కెరీర్‌లో ఒక మ్యాచ్‌లో ట్రిపుల్ సెంచరీ, మరో మ్యాచ్‌లో ఒకే ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లు సాధించిన తొలి క్రికెటర్‌గా నిలిచాడు. 149 ఏళ్ల టెస్టు క్రికెట్ చరిత్రలో ఇంతకుముందు ఏ ఆటగాడూ ఈ రెండు ఘనతలను అందుకోలేదు. **ఇయాన్ బోథమ్ తర్వాత తొలి ఫాస్ట్ బౌలర్** ఒకే టెస్టులో సెంచరీతోపాటు ఏడు వికెట్లు సాధించడం అత్యంత అరుదైన విషయం. ఇప్పటివరకు పలువురు దిగ్గజ క్రికెటర్లు మాత్రమే ఈ ఘనతను అందుకున్నారు. 1980లో ఇంగ్లండ్ మాజీ ఆల్‌రౌండర్ ఇయాన్ బోథమ్ ఈ ఘనత సాధించిన తర్వాత మళ్లీ ఇలాంటి ప్రదర్శన చేసిన తొలి ఫాస్ట్ బౌలర్‌గా ముల్డర్ నిలిచాడు. దక్షిణాఫ్రికా తరఫున ఈ ఘనత సాధించిన తొలి ఆటగాడిగా కూడా గుర్తింపు పొందాడు. బ్యాటింగ్‌లో శతకం, బౌలింగ్‌లో ఏడు వికెట్లు సాధించడం అతడి ఆల్‌రౌండ్ సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచింది. **దక్షిణాఫ్రికా ఘన విజయం** ఈ టెస్టులో దక్షిణాఫ్రికా పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. తొలి ఇన్నింగ్స్‌లో 494 పరుగులకు ఏడు వికెట్లు కోల్పోయిన దశలో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అనంతరం బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో తక్కువ స్కోరుకే పరిమితమైంది. రెండో ఇన్నింగ్స్‌లోనూ దక్షిణాఫ్రికా బౌలర్లు చెలరేగడంతో బంగ్లాదేశ్ 184 పరుగులకే ఆలౌటైంది. దీంతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ 219 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. రెండు టెస్టుల సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఈ మ్యాచ్‌లో అసాధారణ ప్రదర్శన చేసిన ముల్డర్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ పురస్కారం దక్కింది. **ఆల్‌రౌండర్‌గా ముల్డర్ ప్రత్యేక గుర్తింపు** ఆధునిక క్రికెట్‌లో బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ సమాన ప్రతిభ కనబరిచే ఆటగాళ్లకు జట్టులో ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. ముల్డర్ అలాంటి అరుదైన ఆటగాడిగా ఎదుగుతున్నాడు. అవసరమైన సమయంలో బ్యాటింగ్‌తో జట్టును ఆదుకోవడమే కాకుండా, బంతితోనూ ప్రత్యర్థులను దెబ్బతీసే సామర్థ్యం అతడికి ఉంది. జట్టుకు సమతూకం అందించే ఆటగాడిగా అతడి పాత్ర కీలకంగా మారింది. వరుసగా రెండు టెస్టుల్లో రెండు విభిన్నమైన అసాధారణ ఘనతలు సాధించడం అతడి ప్రతిభకు నిదర్శనం.

టాస్ గెలిచిన భారత్.. బ్యాటింగ్ ఎంపిక

శ్రీలంక-ఎతో కీలక పోరు.. జట్టులో ఒక మార్పుతో బరిలోకి భారత్



దోహా: ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో భాగంగా శ్రీలంక-ఎతో జరుగుతున్న తొలి సెమీఫైనల్ మ్యాచ్‌లో భారత్-ఎ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. కెప్టెన్ తిలక్ వర్మ ఈ నిర్ణయం తీసుకున్నాడు. రాత్రి వేళల్లో ఈ పిచ్‌పై బ్యాటింగ్ చేయడం కష్టమయ్యే అవకాశం ఉండటంతో ముందుగా బ్యాటింగ్ చేయాలని నిర్ణయించినట్లు తెలిపాడు.భారత్-ఎ జట్టులో ఒక మార్పు చోటుచేసుకుంది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ స్థానంలో తనుష్ కోటియన్ జట్టులోకి వచ్చాడు. కోటియన్‌కు ఇది అరంగేట్రం మ్యాచ్ కావడం విశేషం. గత మ్యాచ్‌లో అద్భుత ఇన్నింగ్స్ ఆడిన వైభవ్ సూర్యవంశీపై మరోసారి అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అభిషేక్ శర్మ, రింకూ సింగ్, తిలక్ వర్మ వంటి ఆటగాళ్లతో భారత బ్యాటింగ్ పటిష్ఠంగా కనిపిస్తోంది.ఈ టోర్నీలో శ్రీలంక-ఎ జట్టు ఇప్పటివరకు ఓటమి లేకుండా సెమీ ఫైనల్‌కు చేరుకోగా, భారత్-ఎ జట్టు కూడా ఫైనల్ బెర్తు కోసం పట్టుదలతో బరిలోకి దిగింది. విజయం సాధించిన జట్టు టైటిల్ పోరుకు అర్హత సాధించనుంది.

అమిత్ షాతో 'రామాయణ' చిత్ర బృందం భేటీ.. పైరసీపై నిర్మాతల సీరియస్ వార్నింగ్



ప్రస్తుతం దేశవ్యాప్తంగా థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతున్న 'రామాయణ' చిత్ర బృందం కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిసింది. నటీనటులు రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి, దర్శకుడు నితీశ్ తివారీ సహా చిత్ర యూనిట్ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. దీపావళి కానుకగా ఈ నెలలో విడుదలైన ఈ సినిమాకు దేశవిదేశాల్లో విశేష ఆదరణ లభిస్తోందని, ఈ నేపథ్యంలోనే హోంమంత్రితో భేటీ అయినట్లు చిత్ర బృందం సోషల్ మీడియాలో పేర్కొంది.

నితీశ్ తివారీ దర్శకత్వంలో వాల్మీకి రామాయణం ఆధారంగా రెండు భాగాలుగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. మొదటి భాగంలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతాదేవిగా, ప్రముఖ నటుడు యశ్ రావణుడిగా నటిస్తున్నారు.ఒకవైపు సినిమాకు ప్రశంసలు వెల్లువెత్తుతుండగా, మరోవైపు పైరసీ సమస్య చిత్ర బృందానికి తలనొప్పిగా మారింది. థియేటర్లలో సినిమాను రికార్డ్ చేసి, ఆ వీడియోలను సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేస్తున్న వారిపై నిర్మాతలు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. సినిమాను అనధికారికంగా రికార్డ్ చేయడం, షేర్ చేయడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. బాంబే హైకోర్టు నవంబర్ 2, 6 తేదీల్లో ఇచ్చిన ఆదేశాల ప్రకారం.. సినిమా పైరసీకి పాల్పడటం శిక్షార్హమైన నేరమని గుర్తుచేశారు. కాపీరైట్ చట్టం, సినిమాటోగ్రఫీ చట్టం, బీఎన్ఎస్, ఐటీ చట్టాల కింద క్రిమినల్, సివిల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే పోస్ట్ చేసిన ఫుటేజ్‌ను వెంటనే తొలగించాలని, లేకపోతే ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే కఠిన చర్యలు తప్పవని నిర్మాతలు స్పష్టం చేశారు.

ధర్మాన్ని కాపాడే 'వృషకర్మ'..

అంచనాలు పెంచుతున్న చైతూ కొత్త సినిమా ట్రైలర్!

అక్కినేని నాగ చైతన్య కథానాయకుడిగా, 'విరూపాక్ష'తో సంచలన విజయం సాధించిన దర్శకుడు కార్తీక్ వర్మ దండు రూపొందిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వృషకర్మ'. మైథలాజికల్ అడ్వెంచర్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను చిత్ర బృందం తాజాగా విడుదల చేసింది. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంపై, విడుదలైన ట్రైలర్ అంచనాలను అమాంతం పెంచేసింది. సోషల్ మీడియాలో ఈ ట్రైలర్‌కు విశేష స్పందన లభిస్తోంది.



ట్రైలర్‌ను పరిశీలిస్తే, సుమారు 5 వేల సంవత్సరాల క్రితం నాటి ఒక అతీంద్రియ శక్తి చుట్టూ కథనం అల్లినట్లు స్పష్టమవుతోంది. 'అర్జున్' అనే ట్రెజర్ హంటర్ పాత్రలో నాగ చైతన్య సాహసయాత్రతో ట్రైలర్ ఆసక్తికరంగా మొదలైంది. పురాతన గుహలలోని రహస్యాలను ఛేదించే క్రమంలో, వేద విజ్ఞానానికి సంబంధించిన ఓ నిగూఢ శక్తి బయటపడుతుంది. అయితే, ఆ శక్తి వల్ల మానవాళికి పెను ప్రమాదం ఏర్పడుతుంది. ఆ విపత్తును అడ్డుకుని, సృష్టి ధర్మాన్ని కాపాడేందుకు కథానాయకుడు 'వృషకర్మ' అనే దైవిక శక్తిగా అవతారం ఎత్తడమే ఈ కథలో అసలు మలుపు అని ట్రైలర్ ద్వారా తెలుస్తోంది.ఈ చిత్రంలో నాగ చైతన్య మేకోవర్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఇప్పటివరకు లవర్ బాయ్, క్లాస్ పాత్రల్లో మెప్పించిన ఆయన, తొలిసారి పూర్తి రఫ్ అండ్ ఇంటెన్స్ అవతార్‌లో కనిపించి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. యాక్షన్ సన్నివేశాల్లో ఆయన కష్టం తెరపై కనిపిస్తోంది. బాలీవుడ్ నటుడు స్పర్శ్ శ్రీవాస్తవ ప్రతినాయకుడిగా తన విలక్షణమైన గెటప్స్, భయపెట్టే హావభావాలతో ట్రైలర్‌లో బలంగా ముద్ర వేశారు.హీరోయిన్‌గా మీనాక్షి చౌదరి 'దక్ష' పాత్రలో, సీనియర్ నటుడు జయరామ్ 'ప్రొఫెసర్ రంగనాథ్' పాత్రలో కనిపించనున్నారు. ఉత్కంఠభరితమైన ఈ కథనంలో కమెడియన్ సత్య తన మార్క్ కామెడీతో ప్రేక్షకులకు రిలీఫ్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. భారీ అంచనాల మధ్య 'వృషకర్మ' చిత్రం డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

అన్నా చెల్లెళ్ల కథే.. 'భోగి'



శర్వానంద్ భోగి సినిమా మరో రెండు రోజుల్లో థియేటర్లకు రాబోతోంది. సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ట్రైలర్ చూస్తే యాక్షన్, వయొలెన్స్ ఎక్కువగానే కనిపిస్తున్నాయి. అయితే ప్రమోషన్స్‌లో సంపత్ మాత్రం సినిమాలో ఎమోషన్స్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని చెబుతున్నారు. ముఖ్యంగా అన్నాచెల్లెళ్ల అనుబంధమే కథకు బలమని తెలిపారు. మరి ఇలాంటి ఫ్యామిలీ ఎమోషన్స్ ఉన్న సినిమాకు ఈ సర్టిఫికెట్ రావడం ఎంతవరకు ఉపయోగపడుతుందనేది అసలు డౌట్.భోగి కథ ఒక అన్నయ్య, ఐదుగురు చెల్లెళ్ల చుట్టూ తిరుగుతుందని సంపత్ నంది వెల్లడించారు. వాళ్ల కోసం అన్నయ్య ఎంత దూరమైనా వెళ్తాడనే పాయింట్‌తో కథను రూపొందించారట. అయితే ఈ ప్రయాణంలో వయొలెన్స్ కూడా ఎక్కువగానే ఉంటుందని చెప్పారు. కథలో భాగంగానే యాక్షన్ సన్నివేశాలు వస్తాయని, కావాలని ఎక్కడా హింసను జోడించలేదని వివరించారు. సినిమా పూర్తయ్యేసరికి ఆ వయొలెన్స్ వెనుక ఉన్న ఎమోషన్ ప్రేక్షకులకు అర్థమవుతుందని నమ్మకంగా చెబుతున్నారు.కానీ భోగికి సెన్సార్ బోర్డు A సర్టిఫికెట్ ఇచ్చింది. వయొలెన్స్ కారణంగా సినిమా రివైజింగ్ కమిటీ వరకు వెళ్లింది. చివరికి కొన్ని ఆడియో మ్యూట్స్‌తో సెన్సార్ ప్రక్రియ పూర్తయినట్లు సమాచారం. ఈ సర్టిఫికెట్ అంటే 18 ఏళ్లలోపు పిల్లలకు థియేటర్లలో అనుమతి ఉండదు. దీంతో పిల్లలను తీసుకుని సినిమాకు వెళ్లే కుటుంబాలకు అవకాశం తక్కువే. అన్నాచెల్లెళ్ల ఎమోషన్ ప్రధానంగా ఉన్న సినిమాకు ఇది కొంతవరకు ఇబ్బంది అయ్యే ఛాన్స్ ఉంది. నిజానికి శర్వానంద్‌కు ఫ్యామిలీ ఆడియన్స్‌లో మంచి గుర్తింపు ఉంది. శతమానం భవతి, మహానుభావుడు లాంటి సినిమాలతో ఆ వర్గం ప్రేక్షకులకు బాగా దగ్గరయ్యారు. అయితే భోగి కోసం పూర్తిగా మాస్ రూట్‌లోకి మారిపోయారు. రస్టిక్ లుక్, తెలంగాణ యాస, యాక్షన్ సన్నివేశాలతో కొత్తగా కనిపిస్తున్నారు. ఈ మార్పు మాస్ ప్రేక్షకులకు నచ్చొచ్చు. కానీ శర్వా గత సినిమాలను ఇష్టపడే ఫ్యామిలీ ఆడియన్స్‌ను కూడా ఆకట్టుకోవాలంటే కథలోని ఎమోషన్స్ బలంగా ఉండాలి. అయితే A సర్టిఫికెట్ వచ్చిందంటే వసూళ్లకు సమస్య తప్పదని చెప్పలేం. గతంలో పెద్దలకు మాత్రమే అనుమతి ఉన్న కొన్ని యాక్షన్ సినిమాలు మంచి విజయాలు అందుకున్నాయి. భోగి విషయంలోనూ మాస్ ఆడియన్స్ సపోర్ట్ దక్కే అవకాశం ఉంది. పైగా ట్రైలర్‌లో చూపించిన యాక్షన్‌కు కథలో బలమైన కారణం ఉంటే ప్రేక్షకులు కనెక్ట్ కావొచ్చు. సంపత్ నంది కూడా అదే నమ్మకంతో ఉన్నారు.

పెళ్లి కంటే సరైన బంధమే నాకు ముఖ్యం : నిత్యా మేనన్

ప్రముఖ నటి నిత్యా మేనన్ తన వ్యక్తిగత జీవితం, పెళ్లికి సంబంధించిన అంశాలపై వస్తున్న వార్తలపై స్పష్టతనిచ్చారు. తాను వివాహ వ్యవస్థకు వ్యతిరేకం కాదని, సరైన వ్యక్తి దొరికితే తప్పకుండా పెళ్లి చేసుకుంటానని ఆమె వెల్లడించారు. ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, తన పెళ్లి ఆలోచనలు, గత సంబంధాలపై పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

తన అభిప్రాయాలను కొందరు తప్పుగా ప్రచారం చేస్తున్నారని నిత్యా మేనన్ పేర్కొన్నారు. "నేను పెళ్లి చేసుకోను అన్నప్పుడు చాలామంది నన్ను వివాహానికి వ్యతిరేకి అని భావించారు. కానీ నా ఉద్దేశం అది కాదు. నాకూ పెళ్లి చేసుకోవాలనే కోరిక ఉంది. అయితే కేవలం పెళ్లి చేసుకోవడమే లక్ష్యం కాదు, నన్ను అర్థం చేసుకునే సరైన భాగస్వామితో మంచి బంధం ఏర్పడాలి. నాకు స్వేచ్ఛనిచ్చే వ్యక్తి దొరికితేనే వివాహం చేసుకుంటాను. లేదంటే పెళ్లి చేసుకోను" అని ఆమె స్పష్టం చేశారు.



పవన్ కల్యాణ్‌తో ఎలాంటి విభేదాలు లేవు..

సినిమా నుంచి తప్పుకోవడానికి కారణమిదే: సంపత్ నంది



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నటించిన 'సర్దార్ గబ్బర్ సింగ్' సినిమా నుంచి తాను ఎందుకు తప్పుకోవాల్సి వచ్చిందో ప్రముఖ దర్శకుడు సంపత్ నంది స్పష్టతనిచ్చారు. పవన్ కల్యాణ్‌తో తనకు ఎలాంటి విభేదాలు లేవని, కేవలం షూటింగ్ ఆలస్యం కావడం వల్లే పరస్పర అంగీకారంతో ఆ ప్రాజెక్ట్ నుంచి వైదొలిగానని ఆయన వెల్లడించారు. తన తాజా చిత్రం 'భోగి' ప్రమోషన్స్ సందర్భంగా నిర్వహించిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాలను పంచుకున్నారు.

వాస్తవానికి 'సర్దార్ గబ్బర్ సింగ్' చిత్రానికి మొదట సంపత్ నంది దర్శకత్వం వహించాల్సి ఉంది. అయితే ఆ సమయంలో పవన్ ఇతర కమిట్‌మెంట్లతో బిజీగా ఉండటంతో సినిమా ప్రారంభం ఆలస్యమైంది. ఈ విషయంపై సంపత్ నంది మాట్లాడుతూ... "నేనే మొదట ఆ సినిమాకు డైరెక్టర్. అప్పుడు పవన్ కల్యాణ్ వరుస సినిమాలు, వేరే కారణాల వల్ల ఆ సినిమా షూటింగ్ ఆలస్యమయింది. ఆ సినిమా మరింత లేట్ గా మొదలవుతుందని తెలిసి ఒకరోజు పవన్ కల్యాణ్ గారే స్వయంగా నన్ను పిలిచి మాట్లాడారు. సినిమా మొదలవ్వడానికి కొంత సమయం పట్టేలా ఉంది. అప్పటివరకు వెయిట్ చేయగలరా అని నన్ను అడిగారు" అని వెల్లడించారు.అనంతరం తాను స్పందిస్తూ... "నేను ఈ గ్యాప్‌లో వేరే సినిమా పూర్తి చేసుకుంటే మీకు ఇబ్బందేమీ లేదు కదా.. అని పవన్ కల్యాణ్ గారిని అడిగాను" అని తెలిపారు. అలా ఎలాంటి గొడవలు లేకుండా, చాలా సాఫీగా ఆ ప్రాజెక్ట్ నుంచి బయటకు వచ్చినట్లు చెప్పారు. ఎవరినీ ఎక్కువ సమయం ఎదురుచూసేలా చేయడం పవన్ కల్యాణ్‌కు ఇష్టం ఉండదని, తనతో సినిమా చేసేందుకు ఆయన చివరి వరకు ప్రయత్నించారని సంపత్ నంది గుర్తుచేసుకున్నారు. ఆ తర్వాత ఈ సినిమాను దర్శకుడు బాబీ పూర్తి చేసిన సంగతి తెలిసిందే.



అయోధ్యలో యాక్షన్ కింగ్ కొత్త సినిమా.. స్వీయ దర్శకత్వంలో భారీ ప్రాజెక్ట్

రిటైర్డ్ ఆర్మీ అధికారి అందిస్తున్న కథతో సినిమా రూపకల్పన నటుడిగా, దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా మరో భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో ఓ భారీ దేశభక్తి చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ఈ ప్రతిష్టాత్మక సినిమా పూజా కార్యక్రమాలను రేపు అయోధ్యలోని శ్రీరామ జన్మభూమిలో లాంఛనంగా నిర్వహించనున్నారు. అదే రోజున సినిమా టైటిల్‌ను కూడా అధికారికంగా ప్రకటించనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది.ప్రెసిడెన్షియల్ మూవీస్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై అనూప్ మోహన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భారతీయ చలనచిత్ర చరిత్రలోనే తొలిసారిగా ఒక సినిమా ప్రారంభోత్సవాన్ని అయోధ్య రామ మందిర ప్రాంగణంలో నిర్వహించడం ఒక చారిత్రాత్మక ఘట్టమని మేకర్స్ తెలిపారు. భారీ బడ్జెట్‌తో ఎక్కడా రాజీ పడకుండా ఈ చిత్రాన్ని రూపొందించి, పాన్ ఇండియా స్థాయిలో పలు భాషల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం బాలీవుడ్‌తో పాటు ఇతర ప్రాంతీయ పరిశ్రమల నుంచి ప్రముఖ నటీనటులు, సాంకేతిక నిపుణులను తీసుకోనున్నారు.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,

Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com